ఈనాడు ఆదివారం

28 సెప్టెంబరు 2025

వ్యూహకర్త... విజయదుర్గ!



(c) eenadu

'కాంతార'తో విశేష ఆదరణ సొంతం చేసుకున్న కన్నడ నటుడు రిషబ్ శెట్టి. వాటర్ బాయ్‌గా, క్లాప్ బాయ్‌గా పనిచేసి.. ఓ దశలో అసలు సినిమాలే వదిలేద్దామనుకున్న ఈ నటుడు, గతేడాది ఏకంగా జాతీయ అవార్డును సొంతం చేసుకున్నాడు. త్వరలోనే 'కాంతార-చాప్టర్ 1'తో మరోసారి అలరించనున్నాడు. తన కబుర్లే ఇవి...



నా అసలు పేరు రిషబ్ శెట్టి కాదు!

ఆ క్షణాలు ప్రత్యేకం..

జాతీయ అవార్డు అనేది సినిమా రంగంలోని ప్రతి ఒక్కరికీ ఓ కల. బెంగళూరులో వాటర్ క్యాన్ బాయ్‌గా, ముంబయిలో ఓ నిర్మాణ సంస్థలో ఆఫీస్ బాయ్‌గా పని చేసిన నేను.. దిల్లీలో జాతీయ ఉత్తమ నటుడిగా అవార్డు అందుకున్న క్షణాలను ఎప్పటికీ మర్చిపోలేను.

అలా హీరో కావాలనుకున్నా

మాది కర్ణాటకలోని కెరాడి గ్రామం. మా నాన్న జ్యోతిష్కుడు. చిన్నప్పుడు మా ఇంట్లో మాత్రమే కరెంటు, టీవీ ఉండేవి. అప్పుడు దూరదర్శన్‌లో వచ్చే రాజ్‌కుమార్ పాటలను చూసి ఆయనలా హీరో కావాలనుకున్నా. కన్నడ స్టార్ ఉపేంద్ర మా ప్రాంతం వ్యక్తే కావడంతో ఆయన స్ఫూర్తితో దర్శకత్వమూ చేయాలనుకున్నా.



అభిమాన నటులు

నటనలో కమల్ హాసన్ నాకు దేవుడితో సమానం. 'యాంగ్రీ యంగ్ మ్యాన్'లా అమితాబ్ తెరపైన కనిపించే తీరే కాంతారలో నా పాత్రకు స్ఫూర్తి. జూనియర్ ఎన్టీఆర్ వాళ్ల అమ్మగారిది మా ఊరే కావడంతో మా మధ్య మంచి అనుబంధం ఉంది.

పిల్లల కోసం..

ఎప్పటి నుంచో ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించడంతోపాటు పిల్లలకు ఆర్థిక సాయం చేస్తున్నా. అలా వచ్చిన ఆలోచనే 'రిషబ్ శెట్టి ఫౌండేషన్'. ఈ సేవా కార్యక్రమాలను నా భార్య ప్రగతినే స్వయంగా చూస్తుంది.

సినిమా కష్టాలు

డిగ్రీ కోసమని ఇంట్లో వాళ్లు బెంగళూరు పంపిస్తే, నేనేమో ఫిల్మ్ ఇనిస్టిట్యూట్‌లో డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌లో చేరిపోయా. ఆ పనితో నాన్నకు కోపం వచ్చినా.. అక్కే డబ్బు సర్దుబాటు చేసింది. ఎన్నో కష్టనష్టాలూ, అనేక ప్రయత్నాల తర్వాత సహాయ దర్శకుడిగా తొలి అవకాశం దక్కించుకున్నా. కానీ, నాకంటూ గుర్తింపు వచ్చేందుకు మాత్రం నాలుగైదేళ్లు పట్టింది.



అనుకోకుండా కలిశాం

నేనూ, ప్రగతి ఓ సినిమా ఫంక్షన్‌లో అనుకోకుండా కలిశాం. మా ఇద్దరిదీ ఒకే ఊరనీ, ఇద్దరమూ ఫేస్‌బుక్‌లో ఫ్రెండ్స్ అనీ ఆ తర్వాతే తెలిసింది. అలా మొదలైన మా స్నేహం ప్రేమగా మారింది. అప్పటికి నేనింకా జీవితంలో కుదురుకోకపోవడంతో మా పెళ్లికి వాళ్లింట్లో ఒప్పుకోలేదు. చివరకు పెద్దవాళ్ల అంగీకారంతోనే ఒక్కటయ్యాం. కాంతార సినిమాకు కాస్ట్యూమ్స్ అన్నీ తనే డిజైన్ చేసింది.

నా అసలు పేరు...

నా అసలు పేరు ప్రశాంత్ శెట్టి. సినిమాల్లోకి వచ్చే ముందు ప్రత్యేకమైన పేరును ఎంచుకోవాలని అనుకున్నా. స్నేహితుల సూచనతో రిషబ్ శెట్టి అని మార్చుకున్నా. వాళ్లు చెప్పినట్లు.. పేరు మార్చుకున్నాకే నాకు సినిమాల్లో అదృష్టం కలిసొచ్చింది.

తండ్రి పాత్రలో..

పిల్లలతో గడుపుతుంటే అసలు సమయమే తెలియదు. అందుకే కాబోలు.. నా భార్య ఎప్పుడూ హీరో, డైరెక్టర్, రైటర్ కంటే తండ్రి పాత్రలోనే నేను మరింత బాగా లీనమవుతానంటూ మురిసిపోతుంటుంది.

అవి ఓ సవాలే..

ఎంత గొప్ప నటులకైనా.. చారిత్రక నేపథ్యమున్న పాత్రల్లో నటించడం ఓ సవాలే. అలాంటి చిత్రమే కాంతార. అలానే నేను నటిస్తున్న 'జై హనుమాన్', 'ఛత్రపతి శివాజీ మహరాజ్', బంకించంద్ర ఛటర్జీ నవల ఆనంద్‌మఠ్ ఆధారంగా తీసే '1770'.. ఇవన్నీ అదే తరహావి. కాంతార ప్రీక్వెల్ కోసం కత్తియుద్ధం, గుర్రపు స్వారీతోపాటు యుద్ధకళ అయిన కలరిపయట్టులో శిక్షణ తీసుకున్నా.

(c) eenadu

లోపల

4 సిల్లీపాయింట్

5 మాజీ ఐపీఎస్, ఐఏఎస్‌లు... అన్నదానం చేస్తున్నారు!

6 ఓ మహాత్మా... ఓ మహర్షీ!

7 వ్యూహకర్త... విజయదుర్గ!

10 పరిశోధన

11 రత్నాల పిజ్జా, వజ్రాల కేకు..!

12 అవకాశాల్లేక... వాచ్‌మన్‌గా చేరా

13 పోటాపోటీగా... పేదలకి ఇళ్లు కట్టిస్తున్నారు!

14 చీర స్టైలు మారింది!

16 అవీ ఇవీ

17 అమ్మ వదిలేసిన ఆ అబ్బాయి... ప్రపంచ కుబేరుడు!

18 కథ

21 రుచి అభిరుచి

22 సిసింద్రీ

24 సమీక్ష

25 రాశి ఫలం

26 పదకేళి

మంచిమాట

నాయకుడు ఎప్పుడూ కొంతమంది నాయకుల్ని తయారుచెయ్యాలి కానీ వందిమాగధుల్నీ గొర్రెల్లాంటి అనుచరుల్నీ కాదు.

మీకు తెలుసా

జపనీయులు ఏ ఫుడ్ కోర్టులోనో మరోచోటో ఏదయినా కొనుక్కున్నప్పుడు అక్కడే నిల్చుని తింటారు లేదా ఇంటికి పట్టుకెళ్తారు, అంతేతప్ప నడుస్తూ తినరు. అలా నడుస్తూ ఏదయినా తినడాన్ని లేదా తాగడాన్ని అమర్యాదకరంగా, ఆహారానికి ఏ మాత్రం విలువ ఇవ్వనట్లుగా భావిస్తారట. అంతేనా... ఒక్కోసారి ఆ పదార్థాలు లేదా పానీయాలు ఎదుటివారిపైన పడే ఆస్కారమూ ఉంటుంది కాబట్టి... ఎట్టి పరిస్థితుల్లోనూ నడుస్తూ ఏమీ తినరట.

అలాగా!



ఒకప్పుడు ఏదైనా వంట చేస్తే ముందు దేవుడి దగ్గరా, ఆ తర్వాత పెద్దలకూ పెట్టేవారు. కానీ ఇప్పుడు ఇన్‌స్టా, ఫేస్‌బుక్కుల్లోనే ముందు పెడుతున్నారు!

వేరబుల్ టెక్నాలజీ, లేదా AI నిజంగా సడెన్ కార్డియాక్ సిట్యువేషన్‌ని ముందే చెప్పగలవా? లేక అదొక హైప్ మాత్రమేనా?

గుండెపోటు, సడెన్ కార్డియాక్ అరెస్టు లాంటి హార్ట్ ఎమర్జెన్సీలు ఎలాంటి హెచ్చరిక లేకుండా వస్తాయి. అందుకే ఇవి చాలా భయపెట్టే హెల్త్ ఇష్యూస్.

ఇప్పుడు వాచీలు, ఫిట్నెస్ బ్యాండ్లు, AI లాంటివి ఈ ప్రమాదాన్ని ముందే అంచనా వేసి కాపాడతాయని పెద్ద హడావుడి చేస్తున్నారు. కానీ నిజంగానే ఆ స్థాయికి వచ్చేశామా? లేక ఇంకా ఊహల్లోనే ఉన్నామా?

టెక్నాలజీ ఎంత వరకు వచ్చింది?

మొదట - అంటే ఒక దశాబ్దం క్రితం, ఫిట్నెస్ ట్రాకర్లు కేవలం అడుగులు, హార్ట్ రేట్ మాత్రమే చెప్పేవి. కానీ ఇప్పుడు?

స్మార్ట్ వాచీలు, ఛెస్ట్ ట్రాప్స్, హార్ట్ రేట్‌లో తేడాలు, (వేరియబిలిటీ), రక్తంలో ఆక్సిజన్ లెవల్స్ కూడా చెబుతున్నాయి. ECG సిగ్నల్స్ తీసి, ఆట్రియల్ ఫిబ్రిలేషన్ (AFib) లాంటి ఇరెగ్యులర్ రిథమ్స్‌ని పసిగడతాయి.

ఈ డేటాను AI అల్గారిథమ్స్ కంటిన్యూగా చెక్ చేస్తాయి, స్వల్ప మార్పులు ఏమైనా ఉన్నాయా? అని..

ఉదాహరణకు: Apple Watch, Fitbit స్టడీస్‌లో చాలామందికి unknown AFib కేసులు ముందే డిటెక్ట్ అయ్యాయి.

AI ఇంకో స్టెప్ ముందుకి: AI మిలియన్ల డేటా పాయింట్స్‌ని చూసి, "సేఫ్ ఫ్లక్చుయేషన్స్", "డేంజరస్ రెడ్ ఫ్లాగ్స్"ని వేరు చేస్తుంది.


హాస్పిటల్స్‌లో ఇప్పటికే AI సిస్టమ్స్ వాడుతున్నారు. పేషెంట్ వైటల్స్‌ను కంటిన్యూగా మానిటర్ చేసి, పరిస్థితి క్షీణించే ముందు అలర్ట్ చేస్తాయి.

కొన్ని రీసెర్చ్ మోడల్స్ అయితే కార్డియాక్ అరెస్ట్‌ని, గంటల ముందు, కొన్నిసార్లు రోజులు ముందే అంచనా వేస్తాయని చెబుతున్నారు.

కానీ AIతో కొన్ని సమస్యలూ ఉన్నాయి.

manipalhospitals
LIFE'S ON

Dr. N. MURALI KRISHNA



Chief Consultant - Cardiology
Manipal Hospitals
Vijayawada

ప్రస్తుతపు వేరబుల్స్ 100% ఖచ్చితమైనవి కావు.

ఫాల్స్ నెగటివ్స్ ద్వారా సమస్య ఉన్నా "అన్నీ బాగానే ఉన్నాయి" అన్నట్లు రిపోర్ట్ చేయొచ్చు. దాని వల్ల పేషెంట్లు, డాక్టర్లు, పెద్దగా పట్టించుకోకపోవచ్చు. అలాగే, ఫాల్స్ పాజిటివ్స్ వల్ల, నిజంగా సమస్య లేకపోయినా, అనవసర భయాలకు లోనవవచ్చు.

సడెన్ కార్డియాక్ అరెస్టుని అంచనా వేయడం, కేవలం heart rhythm (గుండె లయ) తో సాధ్యం కాదు. జన్యుపరంగా, లైఫ్‌స్టయిల్, అంతర్లీనంగా ఉన్న మిగతా వ్యాధుల కారణంగా, పర్యావరణం - ఇలా అన్నీ కలసి పని చేస్తాయి.

యాక్సెస్ మరియు ప్రైవసీ సమస్యలు - అడ్వాన్స్‌డ్ AI పరికరాలు ఖరీదైనవి. అందరికీ అందుబాటులో ఉండవు. హెల్త్ డేటా ని ఎవరు వాడతారు? ఎవరికి అందుబాటులో ఉంటుంది. ఎలా సంరక్షిస్తారు అనే నైతిక సందేహాలు కూడా ఉన్నాయి.

చివరిగా... ఇది పూర్తిగా హైప్ కాదు. ఇప్పటికే వేరబుల్స్ ఇంకా AI పరికరాలు, ఎరిథ్మియా లాంటి సమస్యలని ముందే గుర్తించి, సకాలంలో చికిత్సని అందించేలా చేశాయి.

కానీ గుండెపోటు లేదా సడెన్ కార్డియాక్ అరెస్టుని 100% ఖచ్చితత్వంతో అంచనా వేస్తుంది, నివారిస్తుంది అనే స్థాయికి మాత్రం ఇంకా రాలేదనే చెప్పాలి.

ప్రస్తుతానికి వేరబుల్ టెక్నాలజీ అనేది కేవలం ఒక సప్లిమెంట్ మాత్రమే, సబ్‌స్టిట్యూట్ (ప్రత్యామ్నాయం) కాదు.

అంటే, డాక్టర్ చెకప్, క్లినికల్ గ్రేడ్ మానిటరింగ్, ఆరోగ్యకరమైన జీవన విధానం... (హెల్దీ లైఫ్‌స్టైల్) ఇవన్నీ తప్పనిసరి. వాచీలు, AI లాంటి పరకరాలని కేవలం ఒక అదనపు సపోర్ట్‌గా మాత్రమే చూడాలి.

ADVERTISEMENT

(c) eenadu

సిల్లీ పాయింట్



కారు, బస్సు, రైళ్లలాంటి వాహనాలు ఎక్కగానే కొందరికి నిద్ర ముంచుకొచ్చేస్తుంటుంది కదా... అలాంటి పరిస్థితిని వర్ణించేందుకు ఆంగ్లంలో ఓ పదం ఉది. అదే కార్‌కోలెప్సీ.

★ మిగతా వారితో పోలిస్తే, పెంపుడు జంతువులతో ఆడుకునే పిల్లల్లో ఫుడ్ అలర్జీలు తక్కువట.

★ గ్లాసు చల్లని నీళ్లు తాగితే... మన శరీరంలో 8 నుంచి 10 కెలోరీలు ఖర్చవుతాయట.

★ వస్తువుల కంటే అనుభూతులు పొందేందుకు ఖర్చు చేసేవారే ఎక్కువ సంతోషంగా ఉంటున్నట్లు చెబుతోంది ఓ అధ్యయనం.

★ ఆంగ్లంలో- వెయ్యిలోపు అంకెల స్పెల్లింగులో 'ఎ' అక్షరం ఒక్కసారి కూడా రాదు.

★ మానవ శరీరంలో- ఒక్క మెదడే- అది పనిచేసేందుకు రోజుకు 400 నుంచి 500 కెలోరీలను కరిగిస్తుందట.

★ చెల్లింపులను నగదు రూపంలో చేసే వారికంటే వివిధ కార్డులతో చేసేవారు- సుమారుగా రెండింతలు ఎక్కువగా ఖర్చు చేస్తున్నారని ఓ సర్వేలో తేలింది.

★ ఈఫిల్ టవర్‌ని మొదట స్పెయిన్‌లోని బార్సిలోనాలో నిర్మించాలనుకొని డిజైన్ చేశారు. కానీ, ఆ ఆకృతిపైన భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడం, ఖర్చు భారీగా అవుతుండటంతో.. ఆ ప్రాజెక్టు పారిస్‌కు తరలిపోయింది.

★ హఫె ఫోబియా... ఇష్టమైన వాళ్లయినా సరే, తమను తాకడం లేదా తాము ఎవరినైనా తాకేందుకు భయపడటాన్ని ఇలా అంటారు.

★ 1900 నుంచి 1920 వరకూ ఒలింపిక్స్‌లో 'టగ్ ఆఫ్ వార్' పోటీలనూ నిర్వహించేవారు.

★ పొద్దుతిరుగుడు పూలన్నీ సూర్యుడితో పాటే తిరుగుతుంటాయనుకుంటాం. కానీ, అన్నీ అలా చేయవు. లేత పువ్వులు మాత్రమే సూర్యుడితోపాటు తూర్పు నుంచి పడమరకు కదులుతుంటాయి. పెద్దవాటి కాండం దృఢమైపోవడంతో కదలడం కష్టమై.. తూర్పు వైపే తిరిగి ఉంటాయట.



ఎక్స్‌ట్రీమ్ ఐరనింగ్ - ఇదో విచిత్రమైన సాహస క్రీడ. ఇందులో పాల్గొనేవారంతా ఇస్త్రీ పెట్టే, స్టాండ్‌తో అత్యంత అసాధారణ ప్రాంతాలకు వెళ్లి అక్కడ ఐరన్ చేయాలన్నమాట. ఎంపిక చేసుకున్న ప్రదేశం, ఇస్త్రీలో నైపుణ్యం ఆధారంగా విజేతను ఎంపిక చేస్తుంటారు.

★ పిండి, బటర్, ఎగ్, చక్కెర... ఈ నాలుగింటినీ పౌండ్ చొప్పున తీసుకొని తయారు చేసే కేక్‌ను 'పౌండ్ కేక్' అని పిలుస్తుంటారు. దీన్ని ఇంగ్లాండ్ సంప్రదాయ కేక్‌గానూ చెబుతుంటారు.

★ తమ ఉద్యోగి ఎవరైనా చనిపోతే, వారి కుటుంబం రోడ్డున పడకూడదనేది గూగుల్ సిద్ధాంతం. అందుకే, సదరు ఉద్యోగి జీతంలో సగాన్ని, పదేళ్లపాటు భాగస్వామికి అందిస్తుంటారు. ఎలాంటి నియమ నిబంధనలూ లేకుండా- సంస్థలో చేరిన మరుక్షణం నుంచే ఈ పాలసీ వర్తిస్తుందట.



ప్రపంచంలోనే అత్యంత పురాతన హోటల్ జపాన్‌లో ఉంది. దాని పేరు 'నిషియమా ఆన్‌సెన్ కియిన్‌కన్'. దాన్ని స్థాపించిన కుటుంబానికి చెందిన 52వ తరం వాళ్లే ప్రస్తుతం హోటల్‌ను నడుపుతున్నారట.



ఇరవై లక్షలకు పైగా సరస్సులు- అంటే, ప్రపంచం మొత్తమ్మీద ఉన్న సరస్సుల్లో దాదాపు 60 శాతం కెనడాలోనే ఉన్నాయి. ఆ దేశ భూభాగంలో ఎక్కువ శాతం నీళ్లేనన్నమాట.



అమెరికాలోని మెకినాక్ ఐలాండ్‌లో కార్లు నడపడం నిషేధం. సైకిళ్లు, గుర్రపు బండ్లే ప్రయాణ సాధనాలు. ఆన్‌లైన్ సంస్థలూ బగ్గీల మీదే వస్తువులను డెలివరీ చేస్తుంటాయట. వాహనాల ఇంజిన్ల శబ్దాలకు గుర్రాలు బెదురుతుండటమే నిషేధానికి కారణం.



ఓ పరిశోధన ప్రకారం... చిన్న పిల్లలు రోజుకు 200 సార్లు నవ్వుతారట. అదే ఆడవాళ్లయితే సగటున 62 సార్లు, మగవాళ్లు ఎనిమిదిసార్లు నవ్వుతుంటారని తేలింది.



డ్రైవింగ్ టెస్టులో ఎక్కువసార్లు ఫెయిలైన రికార్డు దక్షిణ కొరియా మహిళ చ స-సూన్ పేరిట ఉంది. ఆమె ఏకంగా 959 సార్లు విఫలమై... 960వ ప్రయత్నంలో పాసైంది.

(c) eenadu

మాజీ ఐపీఎస్, ఐఏఎస్‌లు...
అన్నదానం చేస్తున్నారు!

ఆకలి వేసినపుడు ఉన్నవాళ్లు ఏదో ఒకటి తిని కడుపు నింపేసుకుంటారు, మరి లేనివాళ్ల సంగతేమిటి? కేవలం పట్టెడన్నం కోసం ఎన్నో పాట్లు పడతారు వాళ్లు. ఒక్కోసారి అది కూడా లభించక మంచి నీళ్లతోనే కానిచ్చేస్తారు. అలాంటివాళ్లకు కనీసం ఒక పూటైనా కడుపునిండా భోజనం అందివ్వాలనే సంకల్పంతో ఏర్పాటైందే 'రోటీ బ్యాంక్ హైదరాబాద్'. అయిదేళ్ల నుంచీ కొనసాగుతున్న ఈ నిత్యాన్నదాన కార్యక్రమం - రోజూ రెండు వందలమంది చొప్పున ఇప్పటివరకూ నాలుగులక్షలకు పైగా మీల్స్‌ను అందించడం విశేషం.







చిన్నాచితకా పనులు చేసేవాళ్లూ, పూరిగుడిసెల్లో ఉండేవాళ్లూ, రోజు కూలీలూ... వీళ్లందరికీ వచ్చే ఆదాయం అంతంత మాత్రమే. నిత్యావసరాల ధరలన్నీ ఆకాశాన్నంటుతున్న ఈ రోజుల్లో వాళ్లకు వచ్చే ఆ కొద్దిపాటి సంపాదనతో ఇంటిల్లిపాదీ కడుపు నిండా భోజనం చేయడం అనేది అసాధ్యం. అలాంటివారికి భోజనం పెట్టాలనే ఆలోచనతో ఏర్పాటైందే 'రోటీ బ్యాంక్ హైదరాబాద్'. వారంలో ఆరురోజులపాటు పలు ప్రాంతాల్లోని నిరుపేదలకు ఆహారం అందించే ఈ సంస్థను ప్రారంభించడం వెనుక చిన్న కథే ఉంది. అది కొవిడ్ సమయం. చిన్నచిన్న పనులకోసం హైదరాబాద్‌కు వలస వచ్చిన ఎంతోమంది పేదలు పనిలేక సొంతూళ్లకు కాలినడకన వెళ్లిపోయేందుకు సిద్ధమయ్యారు. వారిలో కొందరికి తోచిన సాయం చేయాలనుకుని చెప్పులూ, బూట్లూ పంచిపెట్టారు తెలంగాణ మాజీ డీజీపీ అరుణా బహుగుణ. ముంబయికి ఒకప్పుడు పోలీసు కమిషనర్‌గా ఉన్న డి.శివనందన్‌కు అది తెలిసి అన్నదానం కూడా చేస్తే బాగుంటుందని చెబుతూ... అక్కడ తాను ప్రారంభించిన రోటీబ్యాంకు సేవ గురించీ ఆమెకు వివరించారు. ఆయన మాటలకు స్ఫూర్తిపొందిన అరుణకు మరికొందరు రిటైర్డ్ ఐపీఎస్, ఐఏఎస్, ఐఆర్ఎస్ అధికారులూ వ్యాపారవేత్తలూ తోడయ్యారు. అలా ఎనిమిది మంది కలిసి ఓ ట్రస్టుగా ఏర్పడి కొవిడ్ సమయంలోనే 'రోటీ బ్యాంక్ హైదరాబాద్'ను ప్రారంభించారు. నేటివరకూ నాలుగులక్షలకు పైగా మీల్స్‌ను అందించిందీ సంస్థ.


రోజుకో చోట...

రోజూ రెండువందల మందికి భోజనాన్ని అందించే ఈ రోటీబ్యాంకు సేవలు ఏ ఒక్క ప్రాంతానికో పరిమితం కాదు. రాచకొండ, హైదరాబాద్, సైబరాబాద్ కమిషనరేట్ల పరిధుల్లో ఉండే బసవతారకనగర్, గౌలిదొడ్డి, గోపనపల్లి తాండా, గురుబ్రహ్మనగర్, టోలిచౌకి... తదితర ప్రాంతాల్లోని మురికివాడలూ బస్తీల్లో రోజుకూలీలూ, చిన్నాచితకా పనులు చేసేవాళ్లూ, భిక్షాటనకు వెళ్లేవాళ్లూ, నిరాశ్రయులూ, చెత్త ఏరుకునేవాళ్లే ఎక్కువ. వీళ్లందరి దగ్గరకూ రోజూ ఈ రోటీబ్యాంకు వాహనం ఆహారాన్ని తీసుకెళ్తుంది. అయితే రోజుకో ప్రాంతాన్ని ఎంచుకుని సోమవారం నుంచి శనివారం వరకూ ఆరుచోట్ల నిత్యాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. ఉదయం లేదా సాయంత్రం పూట చేసే ఈ నిత్యాన్నదానంలో అన్నంతోపాటు పప్పు లేదా సాంబారును పంచిపెడుతుంది. ఇందుకోసం ప్రత్యేకంగా కిచెన్, వంటవాళ్లూ, వండినవాటిని తీసుకెళ్లేందుకు రెండు వాహనాలతోపాటు ఆహారాన్ని పంచిపెట్టేందుకు వలంటీర్లూ నిత్యం అందుబాటులో ఉంటారు. భోజనంతోపాటు అప్పుడప్పుడూ గుడ్లు, పండ్లు, చిరుతిళ్లు వంటివీ ఇస్తాం. 'మా ట్రస్టు సభ్యులు తలాకొంత సొమ్ము వేసుకోవడమే కాకుండా కొందరు దాతలు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు... పప్పులు, బియ్యం, కూరగాయలు, దుప్పట్లు, చాపలు, దుస్తులు, గొడుగులు, ఒకరోజు భోజనానికి అయ్యే ఖర్చు... ఇలా తమకు తోచినవి ఇస్తుంటారు. ఎవరేది ఇచ్చినా వీలైనంతమందికి పంచిపెడుతుంటాం. మా ట్రస్టు సభ్యులందరి లక్ష్యం ఒకటే- మేం ఎంచుకున్న ప్రాంతాల్లో ఏ ఒక్కరూ ఆకలితో నిద్రించకూడదనే...' అంటూ వివరిస్తారు దీనికి మేనేజింగ్ ట్రస్టీగా వ్యవహరిస్తున్న అరుణా బహుగుణ. ★

వరల్డ్ ఆర్థరైటిస్ డే సందర్భంగా జాయింట్ ఇంజక్షన్స్
& పీఆర్పీ ట్రీట్మెంట్ పై 25% రాయితీ
PRP/BMAC/SVF (పీఆర్పీ/బీమాక్/ఎస్వీఎఫ్)
ఈ రాయితీ అక్టోబర్ 1 - 31 వరకు మాత్రమే
AP's 1st Dedicated Musculoskeletal Radiology Pain Relief Clinic
COMPASSION · QUALITY · EXPERTISE
INDO - UK
అవ్యయ క్లినిక్స్
జాయింట్ పెయిన్ రిలీఫ్ క్లినిక్ & జనరల్ ప్రాక్టీస్
SBI బ్యాంక్ ప్రక్కన, న్యూ పోస్టల్ కాలనీ 2వ రోడ్డు ఎదురుగా,
పంటకాలువ రోడ్డు, పటమట, విజయవాడ. ఫోన్: 9014933737
డా॥ సుబ్బారావు చాగంటి
MRCS Ed (UK), FRCR (UK), CCT (UK), PgCert SEM (UK)
కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ మస్క్యులోస్కెలెటల్ రేడియాలజిస్ట్, ఇంటర్వెన్షనల్ పెయిన్ మేనేజ్మెంట్ &
స్పోర్ట్స్ మెడిసిన్ స్పెషలిస్ట్
భరించలేని మోకాళ్ల నొప్పితో నడవలేకపోతున్నారా?
తీవ్రమైన మెడ, నడుమునొప్పి మిమ్మల్ని వేధిస్తుందా?
భుజం నొప్పి మిమ్మల్ని వేధిస్తుందా?

(c) eenadu

మహాత్మా గాంధీ... ప్రపంచానికి భారతదేశం అందించిన అమూల్య నిధి! సత్యం, అహింసలూ కొత్తవేమీ కావు... తరతరాలుగా ప్రపంచంలోని అన్ని సమాజాలూ వాటిని అభిలషిస్తూనే వచ్చాయి. కానీ ఎన్ని అగ్నిపరీక్షలు ఎదురైనా వాటిని పాటించడంలోనూ, అశేష జనవాహిని వాటిని ఆచరించేలా చేయడంలోనూ ఉంది... గాంధీ విజయం! అదే ప్రపంచంలోని పలువురు పోరాట యోధుల్నీ శాంతిబాట పట్టించింది. మరి గాంధీ మనదేశానికేమిటీ... ఆయన ఆదర్శాలు ఇంకా ఇక్కడ సజీవంగానే ఉన్నాయా అంటే... ఆ ప్రశ్నకి స్పష్టమైన జవాబిస్తున్నాయీ ప్రాంతాలు!



ఓ మహాత్మా... ఓ మహర్షీ!

75 ఏళ్లుగా... మద్యం లేదు!

1942... స్వాతంత్ర్య ఉద్యమం ఉవ్వెత్తున ఎగసిన రోజులవి. మహాత్మాగాంధీ పిలుపునిచ్చిన ఉప్పు సత్యాగ్రహం ఉద్యమాన్ని ప్రకాశం జిల్లా నలుమూలలకీ తీసుకెళ్లారు టంగుటూరి ప్రకాశం పంతులు. దేవరపాడు గ్రామంలో ఆయన నిర్వహించిన ఉప్పు సత్యాగ్రహానికి నేటి ముండ్లమూరు మండలంలోని కంభంపాడు యువకులూ వెళ్లారు. సత్యాగ్రహమే కాదు... గాంధీజీ ప్రవచించిన మద్యపాన నిషేధ ఆదర్శాన్నీ నరనరానా జీర్ణించుకున్నారు. అక్కడి నుంచి వచ్చీరావడంతోనే... అక్రమసారా తయారీదారులపైన తిరగబడ్డారు. గాంధీపేరుతో- గ్రామస్థులందరి చేతా ఎవరూ ఎప్పుడూ మద్యపానం ముట్టకూడదని- ప్రతిజ్ఞ చేయించారు. పూర్తిస్థాయి నిషేధం విధించారు. ఆ ప్రతిజ్ఞ నేటితరమూ కొనసాగించడమే... ఆ నిషేధం ఇప్పటికీ అమల్లో ఉండటమే... కంభంపాడు సాధించిన అరుదైన ఘనత. రాజకీయ పార్టీల అండదండలతో కొందరు ఇక్కడ మద్యంషాపు తెరవడానికి అనుమతులు తెచ్చుకున్న ప్రతిసారీ... ఊరు మొత్తం తిరగబడి దాన్ని రద్దు చేయించింది. ఈ కట్టుబాటు ఆ గ్రామాన్ని ప్రశాంతవనంగా నిలిపింది. 90 శాతం అక్షరాస్యతని సాధించేలా చేసింది. ఈ గ్రామానికి చెందిన అరవై శాతం యువత వృత్తివిద్యా కోర్సుల్ని ముగించి ఎమ్మెన్సీల్లో పని చేస్తున్నారంటే... చూసుకోండి!







ఖాదీతో కోట్లు!

గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్యం అసాధ్యమేమీ కాదని చాటుతుంది... కర్ణాటక బెళగావి జిల్లాలోని హుదలి గ్రామం! గాంధీ స్ఫూర్తితో 1954లో ఇక్కడ మొదలైన 'హుదలి ఖాదీ గ్రామోద్యోగ్ ఉత్పాదక సంఘం'... ఖద్దరు ఉత్పత్తిలో ఏటా రెండుకోట్ల రూపాయల టర్నోవర్ సాధిస్తోంది. వేలమంది చేనేత కార్మికులు(వాళ్లలో అత్యధికులు స్త్రీలు) చరఖా తిప్పి రోజు ఐదొందల రూపాయలదాకా సంపాదిస్తున్నారు! మరోవైపు సాగులోనూ ఈ గ్రామం పూర్తిస్థాయి స్వయంసమృద్ధిని అందుకుంది. దగ్గర్లోని చక్కెర కర్మాగారాలన్నీ పూర్తిగా వీళ్లు పండించే చెరకుపైన ఆధారపడతాయి. అంతేకాదు, ఇక్కడి ప్రజల్లో నాటుకుపోయిన దేశభక్తి కారణంగా ఈ గ్రామంలోని ప్రతి రెండు గడపలకూ ఓ జవానుని చూడొచ్చు! ఇంతటి స్వయం సమృద్ధీ, సంపాదనా ఉన్న మరే గ్రామంలోనైనా కొద్దోగొప్పో మద్యం అలవాటు కనిపించొచ్చు కదా! ఇక్కడ అదేం ఉండదు. 1937 నుంచీ ఈ గ్రామంలో ఎవరూ మద్యమే కాదు మాంసాన్నీ ముట్టట్లేదు! ఆ సంవత్సరం నుంచే ఎందుకూ అంటారా... అప్పుడే ఇక్కడికి గాంధీ వచ్చారు. బెళగావి పట్టణంలో కాంగ్రెస్ సమావేశం జరిగితే... ఆయనకి ఈ గ్రామంలోనే బస ఏర్పాటు చేశారట. ఆ మూడురోజులూ వర్షం పడుతుంటే... ఆయన తన గదిలో కూర్చోకుండా... ఇక్కడి ప్రజల మధ్యే ఇష్టాగోష్ఠిచేస్తూ గడిపారట. ఆ మూడురోజుల స్ఫూర్తిని యథాతథంగా నిలుపుకోవడమే... తమ ప్రగతికి కారణమంటారు హుదలి ప్రజలు!

ఒకే ఊరిలో 14 గ్రంథాలయాలు!

ఆలయ ప్రవేశం... స్వాతంత్ర్య పోరాటంతోపాటూ గాంధీజీ పెద్ద ఎత్తున ప్రజల్లోకి తీసుకెళ్లిన ఉద్యమం. గాంధీజీ స్ఫూర్తితో కేరళలోని పయ్యనూరు టౌన్‌లో ఆనందతీర్థులనే సాధువు ఆలయాల్లో బడుగు వర్గాల ప్రవేశానికి నడుం బిగించారు. అది తెలిసి బాపూజీ స్వయంగా ఇక్కడికి వచ్చారట. ఆయన రాక... ఆ ప్రాంతంలోని యువతలో స్వాతంత్ర్య స్ఫూర్తిని రాజేసింది. పెద్ద ఎత్తున పోరాటంలో దూకేలా చేసింది. అప్పట్లో గాంధీతోపాటూ ఇక్కడికి వచ్చిన ఆయన కార్యదర్శి మహదేవ్ దేశాయ్‌పైనా ఇక్కడి ప్రజలు మమకారం పెంచుకున్నారు. బాపూజీ గుజరాతీలో రాసిన ఆత్మచరిత్రని ఆంగ్లంలోకి అనువదించిన ఆయన్ని ఎంతో అభిమానించారు. అందుకే, 1942లో దేశాయ్ చనిపోగానే 'భట్టారత్తు కోయిల్' అన్న తమ గ్రామంపేరుని 'మహదేవ్ గ్రామ్'గా మార్చుకున్నారు! ఆయన పేరుమీదే ఓ పెద్ద లైబ్రరీని ఏర్పాటుచేసుకున్నారు. అంతటితో ఆగలేదు... గాంధీ అనుయాయులందరి పేరుమీద 14 గ్రంథాలయాలూ రీడింగ్ రూమ్‌లని నెలకొల్పారు. గ్రామంలో మద్య నిషేధాన్నీ పాటిస్తున్నారు. ఆలయ ప్రవేశాల విషయంలోనూ వీళ్లు గాంధీ స్ఫూర్తిని విడనాడలేదు. కేరళలోని ప్రధాన ఆలయాల్లో ప్రవేశానికి ఇప్పటికీ చాలా కట్టుబాట్లు ఉన్నాయి- పంచెతోనే వెళ్లాలనీ, షర్ట్ తొలగించి మరీ నిల్చోవాలనీ... ఇలాగన్నమాట! కానీ ఈ గ్రామంలో ఉన్న ఆలయాల్లో అలాంటి కట్టుబాట్లేవీ ఉండవు. ఎవరు ఎప్పుడైనా మామూలు దుస్తుల్లోనే ఈ ఆలయాల్లోకి వెళ్లొచ్చు. ఆలయాల ప్రవేశ ద్వారాలపైన దేవుళ్లకి బదులు... 'జాతీయ చిహ్నాన్ని' ఏర్పాటుచేసుకున్న దేశభక్తులు ఈ మహదేవ్ గ్రామస్థులు!





(c) eenadu



ముక్కోటి దేవతలూ సాయం కోసం శరణువేడినప్పుడు...
ముగ్గురు మూర్తులూ నీవే దిక్కని ప్రార్థించినప్పుడు...
ముల్లోకాల రక్షణ కోసం ముగురమ్మల మూలపుటమ్మ సింహవాహనం మీద సమరానికి బయల్దేరుతుంది. వేల సైన్యాల అసురుల్ని ఒక్క దెబ్బకు నేల కూలుస్తుంది. దైత్యులను దునుమాడటానికి దుర్గమ్మ ఎంచుకున్న వ్యూహాలు... మనల్ని మనం ఓ బలమైన దుర్గంలా తీర్చిదిద్దుకోడానికి కూడా ఉపకరిస్తాయి.

వ్యూహకర్త... విజయదుర్గ!

దుర్గం... దుర్భేద్యంగా ఉన్నప్పుడే శత్రువు కన్నెత్తి కూడా చూడలేడు. ఓటమిని గెలవాలంటే, మనిషి కూడా దుర్గమంత దృఢంగా మారాలి. అసుర సంహారం కోసం దుర్గమ్మ ఎంచుకున్న మార్గాలూ, చేసిన యుద్ధాలూ, సాధించిన విజయాలూ... ఆ కసరత్తులో మనకు పాఠాలు అవుతాయి. పురాణాలు అమ్మలగన్న అమ్మ వ్యక్తిత్వాన్ని 'దుర్లభా, దుర్గమా...దుర్గా!' అని నిర్వచించాయి. 'దుఃఖహంత్రీ, సుఖప్రదా, దుష్టదూరా, దురాచారశమనీ, దోషవర్జితా!' అంటూ ఆమె సుగుణాల్ని కీర్తించాయి. నిజానికి దుర్గాతత్వాన్ని ఒక చట్రంలో ఇమడ్చలేం. ఆ మహామాయ... ప్రేమను పంచుతున్నప్పుడు జగన్మాత, ప్రత్యర్థుల ఎత్తుగడల్ని చిత్తు చేస్తున్నప్పుడు వ్యూహకర్త, శత్రుసంహార సమయంలో రౌద్రమూర్తి. మొత్తంగా, సచ్చిదానంద స్వరూపం.

సమస్యలోనే పరిష్కారం...

చీకటి రాత్రి. ఓ వ్యక్తి వీధి దీపం వెలుతురులో దేనికోసమో వెతుకుతున్నాడు. అటుగా వెళ్తున్న పెద్ద మనిషి కాసేపు ఆగి, 'ఏమైనా పోగొట్టుకున్నారా?' అని అడిగాడు. 'అవును. నా ఉంగరం. అదిగో అక్కడ పడిపోయింది' అంటూ దూరంగా ఉన్న చెట్ల పొదలను చూపించాడు. 'ఎక్కడో పడిపోతే, ఇక్కడ వెతకడం ఎందుకూ?' ప్రశ్నించాడు బాటసారి. 'అక్కడ చిమ్మ చీకటి. ఇక్కడైతే వెలుతురు ఉందనీ...' జవాబిచ్చాడు ఆ వ్యక్తి అమాయకంగా. ఏ వస్తువునైనా పడిపోయిన చోటే గాలించాలి. ఏ పరిష్కారాన్ని అయినా సమస్యలోనే వెతుక్కోవాలి. ఆ సూక్ష్మం తెలియని దేవతలు రక్తబీజుడి ఆగడాల్ని భరించలేక ఎక్కడెక్కడో దాక్కున్నారు. సుదర్శన చక్రంతోనో, త్రిశూలంతోనో ఆ రాక్షసుణ్ని హతమార్చడం అసాధ్యం కాబట్టి, శివకేశవులూ చేతులెత్తేశారు. యుద్ధంలో నేల పాలైన ప్రతి రక్తపు చుక్కలోంచీ వేలాది రక్తబీజులు పుట్టుకొచ్చేలా శివుడి వరం పొందాడు మరి! బుర్రలు బద్దలుకొట్టుకున్నా ముక్కోటిమందికీ ఒక్క పరిష్కారమూ దొరకలేదు. దీంతో మూకుమ్మడిగా వెళ్లి మూలపుటమ్మను ఆశ్రయించారు. మరుక్షణమే ఆమె 'క్రైసిస్ మేనేజర్' పాత్రలోకి ప్రవేశించింది. దేవతల కష్టాలన్నీ సావధానంగా విన్నాక... 'అంటే, రక్తం నేలమీద పడితేనే కొత్త రక్తబీజులు పుట్టుకొస్తారన్నమాట! పడకపోతే ఇబ్బందే లేదుగా...' అంటూ సమస్యలోంచే ఓ పరిష్కారాన్ని వెలికితీసింది. స్వయంగా తానే అసుర సంహారానికి బయల్దేరింది. ఒక్క దెబ్బకు రక్తబీజుడి తల నరికేసింది. ఆ రక్తం నేలపాలు కాకుండా జిహ్వను రణక్షేత్రమంత సువిశాలం చేసింది. అలా, పదునైన వ్యూహంతో ముల్లోకాలకూ రక్తబీజుడి పీడ విరగడ చేసింది. చెడు ఆలోచనలు కూడా రక్త బీజాల్లాంటివే. కోపం లోంచి ద్వేషం, ద్వేషం లోంచి అసూయ, అసూయ లోంచి హింస... ఇలా ప్రమాదకరమైన ఉద్వేగాలన్నీ ఒకదాని వెంట ఒకటి పుట్టుకొస్తాయి. వీటినే 'కనెక్టింగ్ థాట్స్' అంటారు. తొలి ఆలోచన దగ్గరే ఆ లంకెను విడగొట్టాలి. రక్తబీజుడి రక్తపు చుక్కల్ని అడ్డుకున్న ఆదిశక్తిలా.

చిన్న కర్రలతో పెద్దపాము...

శత్రువు బలాన్ని బట్టి ఎత్తుగడలు మారిపోవాలి. అప్పుడే, గెలుపు మలుపును చేరుకోగలం. కాత్యాయినిలో ఆ కార్యదక్షత పుష్కలం. అరుణాసుర సంహారమే అందుకు నిదర్శనం. ఏ ఆయుధంతోనూ తనకు మరణం లేకుండా బ్రహ్మదేవుడి వరం పొందాడు అరుణాసురుడు. తన చేతుల్లోని శూలం, చక్రం, ఖడ్గం, గద.. అరుణుడిని అడ్డుకోలేవని జగన్మాతకు అర్థమైపోయింది. దీంతో, 'అవుట్ ఆఫ్ ది బాక్స్' మార్గాన్ని ఎంచుకుంది. చిన్న పామునైనా పెద్ద కర్రతోనే కొట్టాలంటారు. అఖిలాండేశ్వరి మాత్రం అరుణాసుర సంహారంలో... చిన్నచిన్న కర్రలతోనూ పెద్ద పామును మట్టుబెట్టొచ్చని నిరూపించింది. సాయం కోసం వచ్చిన దేవతల సమక్షంలోనే... తన గుప్పిటను బిగించి, క్రమంగా వదులు చేసింది. మరుక్షణమే పదులూ, వందలూ, వేలూ, లక్షలకొద్దీ గండు తుమ్మెదలు ఆమె వేళ్ల మధ్యలోంచి బయటికొచ్చాయి. గుంపులు గుంపులుగా వెళ్లి అరుణుడి మీద దాడి చేశాయి. ఒళ్లంతా తూట్లు పొడిచాయి. ఆ దెబ్బకు కుప్పకూలిపోయాడు. శరీరం మాంసపు ముద్దలా మారిపోయింది. ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. నిజానికి, తుమ్మెద చాలా బలహీనమైన ప్రాణి. అదే ఓ బృందంగా అయితే ఎక్కడలేని 'శక్తి' వస్తుంది. ప్రజా ఉద్యమాల్లో జరిగేదీ ఇదే. విడివిడిగా ఎవరికివారు అతి సామాన్యులే. కలిసి కదిలినప్పుడు మాత్రం, ఆ పదఘట్టనల తీవ్రత నియంతల హృదయ స్పందనల్ని కూడా ఆపేయగలదు.

సమన్వయ విజయం

ఒక చేతికి అసాధ్యం కావచ్చు. రెండు చేతులకు కష్టంగా అనిపించొచ్చు. అదే, పది చేతులు కలిస్తే... సాధించలేనిదంటూ ఉండదు. ఒక్కరుగా వెళ్తే త్రిమూర్తుల్లో ఎవరూ త్రిపురాసురులను ఓడించలేరని అమ్మ గ్రహించేసింది. వాళ్ల వరబలం అలాంటిది! ముగ్గురు రాక్షసులు... తారకాక్షుడు, కమలాక్షుడు, విద్యున్మాలి. ఆ ముగ్గురికీ మూడు నగరాలు... బంగారం,

(c) eenadu

వెండి, ఇనుప నిర్మాణాలు. అనునిత్యం అవి అంతరిక్షంలో ప్రయాణిస్తుంటాయి. వెయ్యేళ్లకోసారి మాత్రమే ఒక కక్ష్యలోకి వస్తాయి. ఒకే బాణంతో, ఒక్క దెబ్బకు మూడు నగరాల్నీ ధ్వంసం చేయాలి. అప్పుడే, లక్ష్యం నెరవేరుతుంది. ఇదంతా జరగాలంటే, గురి కలిగిన విలుకాడు దొరకాలి. అత్యంత శక్తిమంతమైన ఆయుధాలు కావాలి. శరవేగంగా కదిలే రథమూ అవసరమే. అందుకే ఈ ప్రాజెక్టులో సకల దేవగణాన్నీ భాగం చేసి, అందరి నైపుణ్యాల్నీ సమన్వయం చేసుకుంది సర్వజ్ఞ. విశ్వకర్మ నిర్మాణ ప్రతిభకు తిరుగులేదు. కాబట్టే, అతనికి రథాన్ని తయారు చేసే బాధ్యతను అప్పగించింది. సూర్యచంద్రుల గమనవేగం అపారం. ఆ కారణంగానే, ఇద్దర్నీ ఆ రథానికి చక్రాలుగా అమర్చింది. బ్రహ్మ త్రికాలజ్ఞుడు. ఆ అర్హతతో సారథి పాత్రను కేటాయించింది. చతుర్వేదాలను నాలుగు గుర్రాలుగా మార్చేసింది. మేరు పర్వతాన్ని విల్లుగా, వాసుకిని వింటినారిగా ఎంచుకుంది. విష్ణువు బాణంగా మారాడు. అమ్మ కనుసైగ చేయగానే పరమేశ్వరుడు గురిపెట్టి సంధించాడు. దెబ్బకు త్రిపురాలు కూలిపోయాయి. ముల్లోకాలూ ఊపిరిపీల్చుకున్నాయి. ఇది నూటికి నూరుపాళ్లా 'త్రిపుర సుందరి' నాయకత్వ ప్రతిభే, సమన్వయ విజయమే.

'బలహీనత'పైనే బాణం

మహిషాసురుడు తనకు అమరత్వాన్ని ప్రసాదించమని బ్రహ్మను వేడుకున్నాడు. సృష్టికర్త నిరాకరించడంతో, 'కనీసం, పురుషజాతి చేతిలో చావు లేకుండా వరమివ్వు చాలు. ఎటూ అబలలు నన్నేమీ చేయలేరు' అంటూ స్త్రీశక్తిని తక్కువ చేసి మాట్లాడాడు. మహిషుడు మహా బలవంతుడే కావచ్చు. ఇంద్రుడిని ముప్పుతిప్పలు పెట్టిన మొనగాడే కావచ్చు. కానీ, ఆడవాళ్లను ఆటబొమ్మలుగా భావించే బలహీన స్వభావం అతనిది. రణప్రియ ఆ లోపం మీదే గురిపెట్టింది. కామాక్షి రూప లావణ్యాల గురించి తన అనుచరులు కథలు కథలుగా వర్ణించడంతో... చొంగ కార్చుకుంటూ అభేద్యమైన అంతఃపురాన్ని వదిలి బయటికొచ్చాడు... ఆడపులి బలాన్ని గ్రహించలేని దున్నపోతులా! ఇంకేముందీ, రెప్పపాటు సమయంలో అసుర సంహారం జరిగిపోయింది. శుంభనిశుంభులకూ ఇదే గతి పట్టింది. వాళ్లకు కూడా అతివలంటే అతి చులకన. మహిషుడి మార్గంలోనే, 'స్త్రీ' మినహా మరెవరూ తమను చంపకుండా వరం పొందారు. ఆ బలహీనతనే విజయ వ్యూహంగా మార్చుకుని... తనతో యుద్ధం చేసి, విజేతలుగా నిలిచినవారినే పెళ్లి చేసుకుంటానని ఊరించింది విశాలాక్షి. దురాశతో బరిలోకి దిగిన రాక్షస ద్వయానికి మృత్యువుతో మనువు జరిపించింది. చాలా యుద్ధాల్లో శత్రువుల్ని ఎవరూ ఓడించరు. తమవైన బలహీనతలతో తమను తాము ఓడించుకుంటారు. ప్రత్యర్థి విజయం లాంఛనప్రాయమే. అదే జరిగింది ఇక్కడ.

సింహావలోకనం

ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు, భూమిలో బలంగా వేళ్లూనుకుపోయిన ఊడలమర్రి అయినా కుప్పకూలాల్సిందే. కానీ, గడ్డిపోచ మాత్రం ఆ విపత్తు నుంచి సురక్షితంగా బయటపడుతుంది. తాత్కాలికంగా పరిస్థితులకు తలవంచినా, అన్నీ సర్దుకోగానే మళ్లీ నిటారుగా నిలబడుతుంది. వృత్రాసుర సంహారానికి అమ్మ అచ్చంగా 'గడ్డిపోచ' వ్యూహాన్నే ఎంచుకుంది. దేవతల్నీ రుషుల్నీ పురమాయించి, సంధికి అంగీకరిస్తున్నట్టు సంకేతాలు పంపింది. దీంతో వృత్రాసురుడు ఆయుధాలను అటకెక్కించి, విందులూ వినోదాలతో కాలక్షేపం చేశాడు. పగలు కానీ, రాత్రి కానీ తననెవరూ చంపకూడదంటూ బ్రహ్మదేవుడి వరం పొందాడు కాబట్టి, దాడికి సంధ్యవేళే సరైన ముహూర్తమని భావించింది భద్రకాళి. ఆ సమయానికి వృత్రాసురుడు ఇష్టసఖులతో సముద్రంలో జలక్రీడలు ఆడుతున్నాడు. ఏ లోహమూ తన శరీరాన్ని ఛేదించకూడదనే పరిమితి ఉంది కాబట్టి... సంద్రపు నురగనే అసుర సంహారానికి ఆయుధంగా ఎంపిక చేసింది అంబిక. అందులో తన తేజస్సును ప్రవేశపెట్టింది. పరదేవత ఆదేశంతో ఇంద్రుడు తన వజ్రాయుధాన్ని ఆ నురగలో ముంచి తీసి... వృత్రాసురుడిని నిలువునా చీల్చాడు. ఏ జింక మీదో దాడికి ముందు... సింహం ఓ అడుగు వెనక్కి వేస్తుంది. అది వెనకడుగు కాదు, సింహావలోకనం! నిజానికి, అవలోకనం అనేది సింహం కంటే మనిషికే ఎక్కువ అవసరం. ఒక అడుగు ముందుకేసి, రెండడుగులు వెనక్కి తీసుకోవడం కంటే... ఓ అడుగు వెనక్కి వేసి, మూడడుగులు ముందుకేయడమే సరైన వ్యూహం, విజయతంత్రం.

రెండు సమస్యలు... ఒక పరిష్కారం

ఒక్క దెబ్బకు రెండు పిట్టలు రాలినప్పుడు, రెండు సమస్యలకు ఒక పరిష్కారం మాత్రం ఎందుకు సాధ్యం కాదు? త్రిలోకాల 'ట్రబుల్ షూటర్'గా మహాదేవి చాలా సందర్భాల్లో రెండు వేరువేరు సంక్షోభాల్ని ఒక చట్రంలోకి

'దుర్గ'తత్త్వం!

అష్టోత్తర శతనామాలూ సహస్రనామాలూ జగన్మాత పేర్లనే కాదు, ఆ నామాలతో ముడిపడిన సద్గుణాలనూ చాటి చెబుతాయి. అవన్నీ ఉత్తముల లక్షణాలు కూడా...

సర్వవిద్యాధిదేవతాయై నమః

అమ్మ అక్షర రూపిణి. అజ్ఞానానికి ప్రతీకలైన రాక్షసుల్ని సంహరించి, జ్ఞానమే సర్వోన్నతమని చాటి చెప్పింది.

నిరహంకారాయై నమః

ఆమె అహంకారానికి అతీతురాలు. త్రిమూర్తులూ అహంకరించిన సమయంలోనూ, తనదైన పద్ధతిలో ఆ ముగ్గురి మాయా పొరలను తొలగించింది.

హంసవాహిన్యై నమః

హంస... పాలనూ నీళ్లనూ వేరు చేస్తుంది. హంసవాహిని అయిన అమ్మకు మంచిచెడుల విచక్షణ అపారం.

ధర్మనిష్ఠాయై నమః

దుర్గమ్మ నిలువెత్తు ధర్మ స్వరూపం. మహా రాక్షసులైనా సరే, ధర్మం తప్పనంత కాలం వాళ్ల జోలికి వెళ్లలేదు.

శుభ్రాయై నమః

తల్లి మనసు పరిశుభ్రం. కల్మషాలకు అతీతం. ఆమె గుండెనిండా ప్రేమే. అసురులకు సైతం మాతృత్వ ప్రేమతో ముక్తినిచ్చింది.

వాణ్యై నమః

జగన్మాత వాక్కుకూ అధిదేవతే. ప్రియభాషణను ఇష్టపడుతుంది. వాచాలతను గర్హిస్తుంది.

స్వతంత్రాయై నమః

దేవి సర్వస్వతంత్రురాలు. ఎవరి మీదా ఆధారపడదు. ఎవర్నీ యాచించదు. ప్రతిసారీ తనదే పైచేయి.

నిస్సంశయాయై నమః

తన ఆలోచనల్లో స్పష్టత ఉంటుంది. ఆచరణలోనూ అంతే కచ్చితత్వం కనిపిస్తుంది.

పూర్ణాయై నమః

శాంకరి పరిపూర్ణతకు మారుపేరు. ఏ కర్తవ్యాన్ని అయినా లోపరహితంగా పూర్తి చేస్తుంది.

తపస్విన్యై నమః

ఆ నిత్యానంద స్వరూపిణి సర్వకాలాల్లోనూ తపోముద్రలో ఉంటుంది. తపస్సు ఏకాగ్రతకు చిహ్నం.

(c) eenadu

తీసుకొచ్చి... ఒక్క వేటుతో పరిష్కరించింది. హయవదన సంహారమూ అలాంటిదే.

దైత్యులతో వేల సంవత్సరాలు పోరాడి అలసిన విష్ణుమూర్తి తన ధనువును చుబుకానికి ఆనించి... నిలబడే నిద్రలోకి జారుకున్నాడు. అంతలోనే, దేవతలకు ఓ మహాయాగాన్ని తలపెట్టాలనే ఆలోచన వచ్చింది. యజ్ఞకర్తా, యజ్ఞభోక్తా ఆయనే కాబట్టి, అనుమతి కోసం వెతుక్కుంటూ వెళ్లారు. శ్రీమన్నారాయణుడిని నిద్రలేపే సాహసం చేయలేక... బ్రహ్మ ఓ చెద పురుగును సృష్టించాడు. అది వెళ్లి వింటిని తినేసింది. దీంతో, ఆ విల్లు రెండు ముక్కలైంది. ఆ సందడికైనా స్వామికి మెలకువ వస్తుందని సృష్టికర్త ఆశ. కానీ, జరిగింది మరొకటి. విల్లు ముక్కలయ్యే క్రమంలో... పదునైన వింటినారి దెబ్బకు విష్ణుమూర్తి తల తెగి, ఎక్కడో పడిపోయింది. దీంతో, దేవతలు సంక్షోభ నివారణ కోసం జగద్రక్షకిని ఆశ్రయించారు.

ఓ సందర్భంలో, హయవదనుడనే రాక్షసుడు అమరత్వాన్ని ప్రసాదించమంటూ అమ్మవారిని ప్రార్థించాడు. అలాంటి ప్రకృతి విరుద్ధమైన వరాలు తాను ఇవ్వలేనని యశస్విని స్పష్టంగా చెప్పింది. దీంతో, 'అయితే, గుర్రం ముఖం కలిగిన వారి చేతిలో మాత్రమే నాకు మరణం ఉండేలా కనికరించమ్మా చాలు!' అని వేడుకున్నాడు. ఆనతిచ్చింది మహాదేవి. అలాంటి వింత రూపం సృష్టిలో ఎవరికీ ఉండదు కాబట్టి, తనకు అమరత్వం ఖాయమనే నిర్ణయానికొచ్చాడు హయవదనుడు. ఆ వరగర్వంతో వేదాలను దొంగిలించాడు. ముల్లోకాల్లో ఉపద్రవాలు సృష్టించాడు.


వ్యూహరచనలో ఆరితేరిన మహామాయ ఓ గుర్రం తలను తెప్పించి, విష్ణువు మొండానికి అతికించింది. అశ్వ ముఖంతో అవతరించిన హయగ్రీవుడు... హయవదనుడిని సంహరించి చతుర్వేదాలను కాపాడాడు. మన ఎదురుగా రెండు సమస్యలు ఉన్నప్పుడు సహజంగానే రెండు పరిష్కారాల కోసం అన్వేషిస్తాం. రెండింటి మూలాలనూ కనిపెట్టి, చాకచక్యంగా ఒకచోట ముడిపెట్టే ప్రయత్నం మాత్రం చేయం. దుర్గాభవానిలా బహుముఖ వ్యూహరచన తెలిసినవారికే ఆ ప్రతిభ సొంతం.

కించిత్ లౌక్యమూ...

నిత్య వ్యవహారంలోనే కాదు, దుష్ట సంహారంలోనూ లౌక్యం అవసరమే. ఆ సుతిమెత్తని అస్త్రాన్ని మధుకైటభుల సంహారం కోసం బయటికి తీసింది విరూపాక్షి. రణ వ్యూహంలో భాగంగా, మహావిష్ణువును యుద్ధానికి పంపింది. వెనకాలే తానూ వెళ్లింది. అవకాశం చిక్కగానే, ఆ అసుర ద్వయం వైపు చూసి, చిలిపి నవ్వులు నవ్వింది, ఉత్తుత్తి వలపు బాణాలూ వేసింది. దీంతో ఆ మదోన్మత్తులు చిత్తయిపోయారు. వాళ్లింకా ఆ మత్తులో ఉన్నప్పుడే, 'బాగా యుద్ధం చేశారు. మీ బలానికి మెచ్చాను, ఏం కావాలో కోరుకోండి' అంటూ విష్ణుమూర్తితో ఇద్దర్నీ అడిగించింది. ఓ అపురూప సౌందర్యరాశి ముందు విష్ణువు తమను అలా అడగటం మధుకైటభులకు నచ్చలేదు. రోషం తన్నుకొచ్చింది. 'మేమేం యాచకులం కాదు. ఎవరో ఇస్తే తీసుకోడానికి. కావాలంటే మేమే ఇస్తాం... నువ్వే అడుగు' అంటూ దబాయించారు. అదే అవకాశంగా భావించి, 'అయితే, మీ ఇద్దరి ప్రాణాలూ ఇవ్వండి చాలు' అని కోరాడు నారాయణుడు. ఆ రాక్షసులకు, ఇచ్చినమాట తప్పడానికి అహం అడ్డొచ్చింది. మరోదారి లేక, శ్రీహరి చేతిలో ప్రాణాలు వదిలారు. ఒకానొక సమయంలో, జగన్మాత మధుకైటభులకు ఇచ్ఛామరణాన్ని ప్రసాదించింది. వాళ్లంతట వాళ్లు చావాలే తప్పించి, ఎవరూ చంపలేరు. అలా తాను సూత్రధారిగా, విష్ణుమూర్తి పాత్రధారిగా దుష్ట సంహార ఘట్టాన్ని పూర్తి చేసింది అమ్మ.

★ ★ ★

దుర్గముడనే రాక్షసుడు దేవతలనూ మహర్షులనే కాదు, ప్రకృతి శక్తులనూ బంధించాడు. దీంతో, కరవుకాటకాలు తాండవించాయి. ఆ పరిస్థితుల్ని చూసి శాంభవి మనసు ద్రవించింది. తనువంతా కనులై వర్షించాయి. ఆ ప్రవాహంతో... చెరువులు నిండాయి. పళ్లూ, కూరగాయలూ పుష్కలంగా పండాయి. జనం ఆకలి తీర్చుకున్నారు. అలా శ్రీశక్తి 'శతాక్షి', 'శాకంబరి' అనిపించుకుంది. ఆ తర్వాత దుర్గముడిని సంహరించి, 'దుర్గ'గా పేరు తెచ్చుకుంది. ఏ విషయంలో అయినా ఏది ముందూ, ఏది తర్వాతా... అనే స్పష్టత చాలా ముఖ్యం. ఆ సంక్షోభ సమయంలోనూ దుర్గమ్మ దుష్టశిక్షణకు రెండో ప్రాధాన్యం ఇచ్చింది. తక్షణం... ప్రజల ఆకలిని తీర్చాలని సంకల్పించింది. మన లక్ష్యం ఎంత గొప్పదైనా కావచ్చు, దానికి మానవతను జోడించినప్పుడే ఓ సార్థకత. 'శక్తి లీడర్‌షిప్' అంతస్సూత్రమూ ఇదే! ★



(c) eenadu



నిద్ర రహస్యం అదే...

నిద్రపోవడం అంటే విశ్రాంతి తీసుకోవడం అనే భావనే ఉంటుంది మనందరిలో. అదీ నిజమే... బాగా నిద్రపోతే మరుసటి రోజు చురుగ్గా కూడా ఉంటాం. అయితే నిద్ర కేవలం విశ్రాంతిని మాత్రమే ఇవ్వడం లేదు... పిల్లలూ, పెద్దల్లో ఎదుగుదలకి అవసరమైన గ్రోత్ హార్మోన్స్ విడుదలకూ కారణమవుతోందని అంటున్నారు కాలిఫోర్నియా యూనివర్సిటీ శాస్త్రవేత్తలు. మనం ఒక చోట ఏ పనీచేయకుండా కూర్చున్నా మనకి విశ్రాంతి దొరుకుతుంది కానీ గాఢమైన నిద్ర మాత్రమే పిల్లల్లో కండరాలు దృఢంగా ఉండటానికీ, ఎముకలు బలంగా మారటానికీ, అదనపు కొవ్వుని కరిగించడానికీ అవసరమైన గ్రోత్ హార్మోన్స్‌ని విడుదల చేస్తుందట. అందుకే ఎదిగే పిల్లలకూ, టీనేజర్లకూ నిద్ర చాలా అవసరం. మరి పెద్దవాళ్లలో ఈ హార్మోన్స్‌తో ఏం ప్రయోజనం అనుకుంటారేమో... జీవక్రియలు సరిగా జరగడానికి అవసరమైన గ్రోత్ హార్మోన్స్ కూడా గాఢమైన నిద్రలోనే విడుదల అవుతాయట. ఈ పనులన్నీ చేస్తూనే ఈ గ్రోత్ హార్మోన్స్ మెదడులోని లోకస్ సారోలియస్ అనే భాగాన్ని చురుగ్గా ఉంచుతాయట. మనం ఏ పనిలో ఉన్నా ఎక్కడ ఉన్నా ఒక ఎరుక(కాన్షియస్)తో ఉంటాం చూశారా, దానికి ఈ లోకస్ సారోలియస్‌నే కారణం.

పరిశోధన

స్మార్ట్ దంతాలివి...

ఒక పన్ను పాడైనా, ఊడిపోయినా ఆ స్థానంలో వైద్యులు కృత్రిమ పన్నును అమరుస్తారు. ఇందుకోసం టైటానియం స్క్రూలనీ, సెరామిక్ క్రౌన్‌లనీ వాడుతుంటారు. అయితే, ఇలా కృత్రిమ దంతాలని అమర్చినప్పుడు పక్క దంతాల తాలూకు నరాలు కూడా పాడవుతుంటాయి. అలాకాకుండా అచ్చంగా సహజమైన దంతాల మాదిరిగా నరాలతో కలిసి ఉండే స్మార్ట్ దంతాలని రూపొందించారు టఫ్ట్స్



యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్ వైద్యులు. మూలకణాలతో రూపొందించిన ఈ దంతాలు శరీరంలో భాగమవ్వడమే కాకుండా ఇతరత్రా వైద్య సేవలనీ అందించడం వీటి ప్రత్యేకత. ఈ దంతాలకున్న సెన్సార్లు మన ఆహార అలవాట్లని విశ్లేషిస్తాయి. ఇందుకోసం ప్రత్యేకించి బ్యాటరీల అవసరం కూడా లేదు, నమిలినప్పుడు వచ్చే శక్తితోనే పనిచేస్తాయి. అలాగే మనలోని అనారోగ్యాలని లాలాజలం ద్వారా ముందుగానే పసికట్టి బ్లూటూత్ ద్వారా వైద్యులకు సమాచారం అందించి, హెచ్చరిస్తాయి.

180 ఏళ్ల తర్వాత...



కొన్ని విషయాలు 'ఏంటీ, ఇది నిజమేనా' అనేలా ఉంటాయి. అలాంటి వాటిల్లో ఒకటి ఆడవాళ్ల జననావయవాలను పరీక్షించడానికి వాడే 'స్పెక్యులమ్' అనే పరికరం గురించిన వాస్తవం. అవును, బాతు ముక్కు ఆకృతిలో ఉండే ఈ స్పెక్యులమ్‌ని కనిపెట్టి దాదాపుగా 180 ఏళ్లు కావొస్తున్నా ఇంతవరకూ ఆ పరికరంలో చెప్పుకోదగిన మార్పులు రాలేదు. ఈ పరికరం లోహంతో తయారుకావడం, ఇబ్బందిగా ఉండే దాని ఆకృతి వల్ల- వాడేటప్పుడు అసౌకర్యంగా అనిపించడంతో చాలామంది మహిళలు కొన్ని రకాల గైనిక్ పరీక్షలకు దూరంగా కూడా ఉంటున్నారట. చాలామంది పాప్‌స్మియర్‌లాంటి పరీక్షలంటే భయపడటానికి ఈ పరికరం కూడా కొంత కారణమట. ఈ నేపథ్యంలోనే పెద్దగా మార్పులకు నోచుకోని ఈ స్పెక్యులమ్ ఆకృతిలో మార్పులు తీసుకొచ్చారు నెదర్లాండ్స్‌కి చెందిన మహిళా శాస్త్రవేత్తలు తమారా, అరియాద్నాలు. వీళ్లు రూపొందించిన స్పెక్యులమ్‌కి 'లిలియమ్' అనే పేరు పెట్టారు... కారణం ఇది చూడ్డానికి లిల్లీపువ్వు ఆకృతిలో ఉండి, వాడినప్పుడు పువ్వులా విచ్చుకునేలా దీన్ని రూపొందించారు. అలాగే, ఇది యోనిభాగంలో నొప్పినీ, బాధనూ కలిగించకుండా వైద్యులకు ఎక్కువ ప్రయోజనకారిగా ఉంటుందట. దీన్ని మెటల్‌తో కాకుండా మెత్తగా ఉండే ప్రత్యేకమైన మెటీరియల్‌ని వాడి రూపొందించారు.

కారంపైన మమకారమా!



కొందరికి కారం అంటే మమకారం అన్నది తెలిసిన విషయమే. కానీ ఈ కారం కేవలం నోటికి రుచిని అందించడమే కాదు, గుండెకూ మేలు చేస్తుందని అంటున్నారు చైనాలోని సెచువాన్ శాస్త్రవేత్తలు. తరచూ కారం తినే వారిలో గుండెజబ్బులూ, మెదడుకు సంబంధించిన అనారోగ్యాలూ దూరంగా ఉండటమే కాకుండా మరణాల రేటు 14 శాతం తక్కువగా ఉందని ఈ పరిశోధనలో తేలింది. ఇందుకోసం సెచువాన్ శాస్త్రవేత్తలు 50వేలమంది వృద్ధులపైన దాదాపు తొమ్మిదేళ్లపాటు అధ్యయనం చేశారట. వారంలో ఆరురోజుల పాటు కారం తినేవారిలో గుండెజబ్బులు తక్కువగా ఉండటం, మెదడులో రక్తం గడ్డకట్టకపోవడం వంటివి గమనించారు. మనం కారం తిన్నప్పుడు నాలుకపైన చుర్రుమనే భావన కలుగుతుంది... అంతటితో అయిపోదు, అదే నరాల్లో ఒకరకమైన ఉత్తేజాన్ని కలిగిస్తుంది, దీనంతటికీ కారణం 'కెప్సేసిన్' అనే బయోయాక్టివ్ కాంపౌండ్. అదే మన నరాల్లో నైట్రిక్ ఆక్సైడ్‌ని విడుదల చేసి గుండె కండరాలపైన భారం పడకుండా చేస్తుందట. వీటితోపాటు కారానికి కొవ్వుని కరిగించే గుణం ఉండటంతో... రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువా తక్కువా కాకుండా ఉంటాయి. అలాగే, అంతర్గత వాపులు రాకుండానూ చేస్తుంది కనుకనే కారం తినేవారిలో ఆయుష్షు పెరుగుతోందని ఈ పరిశోధన చెబుతోంది. అయితే- ఎంత మంచిదైనా మితం ముఖ్యం అన్న సూత్రాన్ని మర్చిపోకండేం!

(c) eenadu





కేకు వజ్రాలతో మెరిసిపోతే... పిజ్జా రత్నాలతో కాంతులీనుతుంటే... ఐస్‌క్రీం బంగారు పూసలతో మిరుమిట్లు గొలిపితే... కళ్లింతలు చేసుకుని మరీ అలాగే చూస్తుండిపోతారు ఎవరైనా! ఆ ఆశ్చర్యాన్ని కలిగించడానికే ఘుమఘుమలాడే వంటకాలు ధగధగల్నీ అద్దుకుంటున్నాయి!

రత్నాల పిజ్జా, వజ్రాల కేకు..!





'ఎంత డబ్బున్నా బంగారాన్ని తింటారా? వజ్రాల్ని మింగుతారా?'... ఇలాంటి మాటలన్నీ ఇదివరకైతే అనొచ్చు కానీ ఇప్పుడు అస్సలు అనలేరండీ. ఎందుకంటే... డబ్బులు కాదు కాస్త కళ ఉంటే చాలు, ఆ తళతళ మెరుపుల బంగారాన్నీ, రత్నాల్నీ కూడా తినేయొచ్చు. అవును మరి... కొందరు ఫుడ్ ఆర్టిస్టులు ఇప్పుడు గోల్డ్, డైమండ్, జెమ్స్‌తో పదార్థాల్ని డెకరేట్ చేస్తున్నారు. అది ఎలాగో, ఏంటో తెలుసుకుందాం పదండి!

చూడగానే నోరూరించేలా కొత్తిమీర, ఉల్లిపాయ, క్యారెట్, బీట్‌రూట్ ముక్కల్లాంటివాటితో ఫుడ్ గార్నిషింగ్ చేయడమే ఎక్కువగా చూస్తుంటామా... కానీ ఫుడ్‌నే ప్యాషన్‌గా చేసుకున్న షెఫ్‌లు కొందరు- తమ సృజనకు పదును పెడుతూ ఐసింగ్‌లతోనే బంగారాన్నీ, విలువైన రాళ్లనీ, ముత్యాల్నీ సృష్టిస్తున్నారు. ఆహార పదార్థాల మీద వాటిని అలంకరిస్తూ ఈ కాస్ట్లియెస్ట్ ఫుడ్‌కి రూపమిస్తున్నారు.

కేకు నుంచి ఐస్‌క్రీం వరకూ...

సాదా రంగులో ఒకే ఫ్లేవర్ కేకు నుంచి తీరొక్క రూపాల్లో త్రీడీ బొమ్మల్లా ఆకట్టుకుంది కేకు. నగల డిజైన్లూ, జ్యువెలరీ మెరుపుల్లోనూ కనువిందు చేసింది. ఆశ్చర్యపరిచే ఆకారాల్లో మాయ చేసింది. తమ కళకు మరింత విలువ పెంచాలనుకున్నారేమో వజ్రాలూ, పచ్చలూ, కెంపులూ, బంగారు పూసలూ, ముత్యాల్నీ ఐసింగ్‌లో భాగం చేసుకుంటూ కేకును ముస్తాబు చేస్తున్నారు కేకు మేకర్లు. అంతేనా... కప్‌కేక్, ఐస్‌క్రీం, పిజ్జా, బర్గర్, బిస్కెట్, డోనట్... తదితర ఫుడ్ ఐటమ్స్ మీదా రత్నాల చమక్కుల్నీ, బంగారు వన్నెల్నీ చూపిస్తూ 'వావ్' అనిపిస్తున్నారు! కానీ ఇది అనుకున్నంత సులువేం కాదండోయ్. బంగారు మెరుపూ, రత్నాల కాంతీ సహజంగా కనిపించాలంటే అది అందరికీ సాధ్యం కాదు. నిరంతరం ప్రయోగాలు చేస్తూ, బేకింగ్‌లో ఎంతో నైపుణ్యం పొందితేనే ఈ జెమ్స్ డెకరేషన్ చేయగలరు మరి.

మీరూ ఇంట్లో ఈ రత్నాల పదార్థాల్ని చేయాలనుకుంటే- ఫుడ్ ఆర్ట్ కోసం మార్కెట్లో ఎడిబుల్ రంగులే కాదు, రంగురంగుల ఎడిబుల్ ముత్యాలూ, రకరకాల బీడ్స్, చమ్కీలూ, డైమండ్స్, జెమ్స్, రత్నాల బ్రూచెస్ లాంటివెన్నో దొరుకుతున్నాయి. ఆహార పదార్థాల మీద వాటిని వాడుతూ అనుకున్న డిజైన్‌ను తయారు చేసుకోవచ్చు. ఈసారి మీ ప్రియమైన వారిని సర్‌ప్రైజ్ చేయాలనుకుంటే బంగారు గొలుసూ, డైమండ్ ఉంగరంతో కలిపి... వజ్రాలు పొదిగిన కేకునో, కెంపులతో మెరిసే పిజ్జానో, బంగారాన్ని చుట్టుకున్న బర్గర్‌నో చేతిలో పెట్టేయండి. విలువైన ఆ ఫుడ్‌లో వెలకట్టలేని మీ ప్రేమ కనిపించకుండా ఉంటుందా? ★









(c) eenadu



ఓ సినిమా హిట్టయితే అందులోని హీరో గురించీ అప్పుడప్పుడూ దర్శకుడి టేకింగ్ గురించీ తప్ప... దాని నేపథ్య సంగీతం గురించి మాట్లాడుకోవడం చాలా అరుదు. 'మిరాయ్'తో ఆ అరుదైన గుర్తింపుని సాధించాడు గౌర హరి. పాటలకూ కొత్త 'వైబ్' ఇచ్చాడు. గత ఏడాది 'హనుమాన్' చిత్రానికి అతనిచ్చిన 'ఎలివేషన్' కూడా చిన్నదేమీ కాదు. ఫాంటసీ సన్నివేశాలని అంత ఎత్తుకు చేరుస్తున్న హరి నడిచొచ్చిన దారి అడుగడుగునా కష్టాలమయమే... మీరే చూడండి...

అవకాశాల్లేక... వాచ్‌మన్‌గా చేరా

మాది తుని. మా నాన్న క్రొవ్విడి బాలసుబ్రహ్మణ్యం ఆంధ్రా షుగర్స్‌లో క్లర్క్ ఉద్యోగం చేస్తుండేవారు. అమ్మ రాధారమణి కూడా ఓ ప్రైవేటు స్కూల్లో టీచర్. ఓ అద్దె ఇంట్లో మధ్యతరగతి జీవితమే గడుపుతూ వచ్చాం కానీ... మా తాతయ్యకి క్యాన్సర్ రావడంతో పరిస్థితి తలకిందులైంది. ఆయన్ని కాపాడుకోవడం కోసం నాన్న అప్పులు చేయడంతో... బాగా చితికిపోయాం. ఇంత చేసీ తాతయ్య బతకలేదు. మరో ఏడాదికి నాన్నమ్మకి స్ట్రోక్ రావడంతో... ఆమెని చూసుకోవడం కోసం అమ్మ టీచర్ ఉద్యోగం మానేయాల్సి వచ్చింది. దాంతో మాకున్న మరో ఆర్థిక ఆదరువూ కరువైంది! ఆ పరిస్థితుల్లో- ఇంట్లో కోమా పేషెంట్ ఉంది కాబట్టి ఇల్లు ఖాళీ చేయమని మా అద్దె ఇంటి ఓనరు చెప్పేశారు. ఓ రోజు వాళ్లు ఇంట్లోని సామాన్లన్నీ బయటపడేస్తే... వాటిని ఓ రిక్షాలో, మా నాన్నమ్మని మరో రిక్షాలో పెట్టుకుని ఓ రోజంతా తిరిగాం. చివరికి శివారులో ఎక్కడో ఇల్లు దొరికింది. ఆ రోజు నాకు కలిగిన బాధనీ ఆ ఉద్వేగాన్నీ తొలిసారిగా కవితగా రాశాను. అప్పటి నుంచే కవితలు రాయడమూ... వాటికి బాణీలు కట్టడమూ నాకు అలవాటైపోయింది. ఇంటర్‌కి వచ్చేనాటికి తెలుగు సినిమా పాటల్ని... నాదైన బాణీల్లో వినిపించడం మొదలుపెట్టాను. అవి విని 'నువ్వు సినిమాల్లో ట్రై చేయొచ్చు' అని అందరూ అంటుంటే కలల్లో విహరిస్తూ ఇల్లు వదిలేసి- సినిమాల్లో డాన్సర్ కావాలనుకుంటున్న నా ఫ్రెండ్‌తో కలిసి హైదరాబాద్ వచ్చేశాను.

ప్లాట్‌ఫామ్ పైనే...

చేతిలో పైసాలేకపోవడంతో రైల్వే ప్లాట్‌ఫామ్‌పైనే ఉంటూ... పొద్దున పక్కనే ఉన్న వినాయకుడి ఆలయంలో పెట్టే ప్రసాదం తిని... అవకాశాల కోసం స్టూడియోల చుట్టూ తిరిగేవాళ్లం. రోజుల తరబడి ఒట్టి నీళ్లతో కడుపు నింపుకోవడంతో నా ఫ్రెండ్ మంచానపడ్డాడు. దాంతో వాణ్ణి తీసుకుని ఇంటికి తిరుగుముఖం పట్టాను. నన్ను చూసి ఇంట్లో వాళ్లందరూ ఏడ్చేశారు. 'ముందు ఇంటర్ పూర్తిచెయ్... తర్వాత సంగీతం సంగతి చూద్దాం' అన్నారు నాన్న. ఇంటర్ పాసయ్యాక... రూ.2 వేలు పెట్టి నాకో గిటార్ కొని ఇచ్చారు. దాన్ని ఎలా వాడాలో తెలియకున్నా... నెలపాటు కుస్తీపట్టి నేను కోరుకున్న స్వరం, పదం పలికేలా మార్చాను. డిగ్రీలో చేరాక... కాలేజీ కల్చరల్స్‌లో నా గిటారు కచేరీ హైలైట్‌గా మారేది. రాజమండ్రిలోని భమిడి కమలాదేవిగారి దగ్గర శాస్త్రీయ సంగీతాన్నీ, ఇళయరాజాగారితో పనిచేసిన త్రిమూర్తులు గారూ, పాల్ గారి దగ్గర కార్డ్స్ ప్రకారం గిటార్ వాయించడాన్నీ నేర్చుకున్నాను. అలా ఏడాదిపాటు నేర్చుకుని హైదరాబాద్ రైలెక్కాను. ఎక్కడా అవకాశాలు రాకపోవడంతో... ఏడువేల రూపాయల జీతానికి ఓ చోట నైట్ వాచ్‌మన్‌గా చేరాను. పగటిపూట ఇందిరా నగర్ కూడలిలో నిలబడి గిటార్ వాయిస్తుంటే అందరూ పిచ్చివాడిలా చూసేవారు. అప్పుడే ఓ ఫ్రెండ్ నన్ను చక్రిగారి తమ్ముడి వద్దకి తీసుకెళ్లాడు. నా సొంత ట్యూన్‌లు ఆయనకు బాగా నచ్చాయి. నైట్ వాచ్‌మన్ జీతంకన్నా వెయ్యిరూపాయలు ఎక్కువ జీతం ఇస్తానని తన టీమ్‌లోకి చేర్చుకున్నారు..

నరకం చూపించారు..!

రెండేళ్ల తర్వాత మరో సంగీత దర్శకుడి దగ్గర నెలజీతగాడిగా వెళ్లాను. అతను నా ట్యూన్‌లని తనవిగా చెప్పుకుని చలామణి కాసాగాడు. అప్పట్లో ఓ కన్నడ సినిమాకి సంగీత దర్శకత్వం చేస్తే అది సూపర్‌హిట్టయ్యింది. కానీ, మూడు లక్షలు ఇస్తానని... ఏడాదిపాటు పనిచేస్తే నెలకి పదివేలే ఇచ్చాడు ఆ దర్శకుడు. పదేళ్లలో ఇలాంటి అనుభవాలెన్నో! ఓ బ్లాక్‌బస్టర్ సినిమాకి 98 శాతం పనుల్ని నేను చేస్తే... దాని దర్శకుడు ఇంకెవరికో క్రెడిట్ ఇచ్చాడు. ఆ సినిమాతో మా బతుకులు బాగవుతాయని నమ్మి, రెండేళ్ళు పగలూ రాత్రీ నేనుపడ్డ కష్టాన్ని ప్రత్యక్షంగా చూసిన అమ్మానాన్నలూ కుదేలైపోయారు. అప్పుడే అమ్మకీ స్ట్రోక్ వచ్చి... కోమాలోకి వెళితే... తొమ్మిది నెలలు ఏ పనీ చేయక తనతోనే ఉండిపోయాను. కుటుంబం మళ్లీ ఆర్థికంగా కుంగిపోయింది. ఆ తర్వాతే 'తుంగభద్ర', 'కృష్ణమ్మ కలిపింది ఇద్దరినీ' వంటి సినిమాలు చేశాను. అప్పుడే... 'హనుమాన్' అవకాశం వచ్చింది.

మిలియన్ వ్యూలు...

'హనుమాన్' చిత్రంలోని నేపథ్య సంగీతం... ముఖ్యంగా 'హనుమాన్ చాలీసా'లో నేను చూపిన నవ్యత సామాన్య ప్రేక్షకుల్లోకి చొచ్చుకు వెళ్లింది. ఆ సినిమా ద్వారా హీరో తేజసజ్జా, తన ద్వారా కార్తీక్ ఘట్టమనేని నాకు దగ్గరయ్యారు. 'మిరాయ్'లో ప్రతి సన్నివేశం సంగీతం పరంగా గొప్పగా ఉండేలా చిత్రికపట్టాను! ఆ కృషిని ప్రేక్షకులు గుర్తించి ప్రశంసలజల్లు కురిపిస్తుంటే... ఈ విజయం కోసమే విధి నన్ను ఇంత కాలం పుటం పెట్టిందేమో అనిపిస్తోంది. ★



(c) eenadu

మనిషికి మనిషి సాయపడితే మంచితనం అంటాం. ప్రజలకి ప్రభుత్వం సాయంచేస్తే సంక్షేమం అని పిలుస్తాం. ఎక్కడైనా సరే మనిషిలోని సేవాదృక్పథమే ప్రభుత్వ సంక్షేమపథకంగా మారుతుంటుంది. అరుదుగా కొన్నిసార్లు సర్కారు పథకంగా మారాక కూడా... మరెంతోమందిని సేవవైపు నడిపిస్తుంది. కేరళలో... నిరుపేదలకి ఇళ్లు కట్టించే విషయంలో అదే జరుగుతోంది. నదీమూలంలా ఎక్కడోపుట్టి... అక్షరాలా లక్షలాది పేదల సొంతింటి కలని నెరవేరుస్తోంది! దేశానికే మార్గదర్శకంగా మారిన ఆ కథేమిటో చూడండి...







పోటాపోటీగా... పేదలకి ఇళ్లు కట్టిస్తున్నారు!

ఆయన పేరు సుందరం. 'సుందరం మేస్త్రీ' అంటే కోళిక్కోడులోని తెన్‌కళిలో ఎవర్నడిగినా చెబుతారు. గత రెండు దశాబ్దాలుగా మేస్త్రీగా కాంట్రాక్టులు తీసుకుని ఇళ్లు కట్టిస్తున్నాడు. ఓ క్వారీలో రాళ్లు కొట్టే కూలీగా జీవితాన్ని మొదలుపెట్టిన ఆయన... మేస్త్రీ అయ్యాకే జీవితంలో నిలదొక్కుకున్నాడు. బాగానే సంపాదించాడు. తన కూతురి పెళ్లికి... కోటి రూపాయలు దాచి ఉంచాడు. కానీ వాళ్లమ్మాయేమో 'ఆ డబ్బు నాకు వద్దు నాన్నా... పెళ్లి ఖర్చు నేనే చూసుకుంటాను' అందట. దాంతో ఆ డబ్బుతో ఓ పెద్ద ప్రాజెక్టుని చేపట్టాడు సుందరం. ఐదుగురు నిరుపేదలకి ఇళ్లు కట్టించి ఇస్తానని ప్రకటించాడు! 160 మంది ముందుకు వస్తే ఐదుగుర్ని ఎంపిక చేసుకుని... ఒక్కొక్కరికీ ఏడుసెంట్ల స్థలంలో 750 చదరపు అడుగులతో రెండు పడకల ఇండివిడ్యువల్ హౌస్‌లని కట్టించి ఇచ్చాడు. వాటి తాళం చెవులు అందిస్తూ 'మేం ఒకప్పుడు టార్పాలిన్ కప్పున్న గుడిసెలో బతికాం' అని పాత జ్ఞాపకాలతో కన్నీళ్లుపెట్టుకున్నాడు.

★ ★ ★

ఆయనో చర్చ్ పాస్టర్. పేరు జిజో కురియన్. 2018 కేరళ వరదలప్పుడు ఇళ్లు కోల్పోయిన పేదల కష్టాలని కళ్లారా చూసినవాడు. అప్పటి నుంచీ నిలువనీడ లేనివాళ్లకి ఇళ్లు కట్టించి ఇవ్వాలని తపించాడు. సామాజిక మాధ్యమాల ద్వారా విరాళాలు సేకరించి ఈ మధ్యే ఇడుక్కి ప్రాంతంలో వంద 'క్యాబిన్ ఇళ్లని' నిర్మించి ఇచ్చాడు. ఎర్నాకుళం పరిధిలోని మూవట్టుపుళ రాణాకి చెందిన పోలీసులూ తమ సహృదయత చాటుకున్నారు. ప్లాట్‌ఫామ్ మీద బతుకుతున్న మూడు కుటుంబాలకి... 1300 చదరపుటడుగులున్న విశాలమైన ఇళ్లని నిర్మించి ఇచ్చారు! తమ జీతం నుంచి తలాకొంత వేసుకుని ఒక్కో ఇంటికీ రూ.10 లక్షలు ఖర్చుపెట్టారు వాళ్లు!



- నిరుపేదలకి ఇలా ఇళ్లు నిర్మించి అందించడమన్నది కేరళలో ఓ ఉద్యమంగానే సాగుతోంది ఇప్పుడు. 'యథారాజా తథా ప్రజా' అన్న మాటని నిజం చేస్తోంది. ఔను... కేరళ ప్రభుత్వం 2018లో రాష్ట్రంలోని అత్యంత నిరుపేదలకి ఇళ్లని నిర్మించి ఇవ్వడం కోసమని 'లైఫ్ మిషన్' అనే పథకాన్ని మొదలుపెట్టింది. ప్రైవేటు రియల్టీ సంస్థలకి దీటుగా చక్కటి నాణ్యతా ప్రమాణాలతో అటు అపార్ట్‌మెంట్‌లూ ఇటు ఇండివిడ్యువల్ హౌస్‌లూ నిర్మిస్తోంది. 4.6 లక్షలమందికనే లక్ష్యాన్ని నిర్దేశించుకుని... మూడేళ్లలోనే ఆ లక్ష్యాన్ని అధిగమించి... మరో రెండు లక్షలమందిని అదనంగా చేర్చుకుంది! ప్రభుత్వం సాధించిన ఈ విజయం... ప్రజల్నీ కదిలించింది. కాసింత డబ్బున్నవాళ్లూ తమ చుట్టుపక్కల ఉన్న పేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తున్నారు. విభిన్న మతసంస్థలూ, వివిధ సేవా ట్రస్టులతోపాటూ కార్పొరేట్ సంస్థలూ పోటాపోటీగా ముందుకు దూకుతున్నాయి...

10 వేల ఇళ్లు!

పనక్కాడు సయ్యద్ మహ్మదాలీ షిహాబ్ తంగల్... ఇది కేరళ మలప్పురానికి చెందిన పేరున్న ఓ సంఘ సంస్కర్త పేరు. ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడుగానూ చేశాడాయన. ఆయన స్మారకంగా ఆ పార్టీ 2011లో కేరళలోని మలప్పురం ప్రాంతంలో పేదలకి బైతురెహ్మా(దయాగృహం) పేరుతో 150 ఇళ్లని ఇలాగే నిర్మించి ఇచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా డిమాండు పెరగడంతో 2018 దాకా రెండువేల ఇళ్లని నిర్మించింది. ఓ రకంగా ఈ పథకమే ప్రభుత్వం చేపట్టిన లైఫ్ మిషన్‌కి స్ఫూర్తిగా నిలిచిందని చెప్పాలి! రాష్ట్రప్రభుత్వం మొదలుపెట్టాక ముస్లిం లీగ్ మరింత జోరు పెంచింది. 2024 నాటికల్లా పదివేల ఇళ్లని పూర్తిచేసి రికార్డు సృష్టించింది! మరోవైపు... కోట్టయం పరిధిలోని పాలా ప్రాంతంలో ఉన్న సిరియన్ క్రైస్తవ డయాసిస్ 'పాలా హోమ్ ప్రాజెక్టు' పేరుతో ఉచిత ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టి... ఇటీవలే 1,750 గృహాలని లబ్ధిదారులకి అందించింది! అటు బైతురెహ్మా, ఇటు పాలా హోమ్ ప్రాజెక్టు రెండూ హిందువులకీ ఇళ్లని నిర్మించి ఇస్తున్నాయి. మతాలకతీతంగా గృహప్రవేశాలూ ఏర్పాటుచేస్తున్నాయి!

కార్పొరేట్ సంస్థలూ...

నిరుపేదల కోసం 'శోభ' అనే రియల్టీ సంస్థా తమ ట్రస్టు ద్వారా వెయ్యి ఉచిత గృహాల నిర్మాణ క్రతువుని తలకెత్తుకుంది. 'గృహ శోభ' పేరుతో రెండొందల ఇళ్లని నిర్మించి ఫర్నిచర్‌నీ ఏర్పాటుచేసి ఇచ్చింది. 'కేరళ ప్రవాసీ అసోసియేషన్ ట్రస్టు' అనే సేవా సంస్థ కూడా వెయ్యి ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టి... దశలవారీగా అందిస్తోంది! అంతేకాదు, తాత తండ్రులు చనిపోతే వాళ్ల సంస్మరణార్థం... పేదలకి ఇళ్లు నిర్మించేవాళ్లూ ఎక్కువవుతున్నారు. ఈ మధ్యే ఎంజావలి కురియన్ జోసఫ్, సిసిలీ అనే దంపతులు చనిపోతే ఆయన పిల్లలు... వాళ్ల పేరుమీద ఓ ట్రస్టు ఏర్పాటుచేసి పేదలకు డ్యూప్లెక్స్ ఇళ్లని నిర్మించి ఇచ్చారు మరి! ★

(c) eenadu

చీర స్టైలు మారింది!

అమ్మాయిల అందాన్ని రెట్టింపు చేయడంలో చీరను మించింది మరొకటి లేదు. ట్రెడిషనల్ అయినా, ట్రెండీ అయినా చీరతో పోటీపడే దుస్తులే కనిపించవు. అంతేనా, కాలాలు మారినా ఎవర్‌గ్రీన్ ఫ్యాషన్‌గా చీరలా నిలబడ్డ ట్రెండ్స్ ఎప్పటికీ రావేమో కూడా! అతివలకి ఓ నిండైన ఆభరణమవుతూ, మహిళల్ని మహారాణుల్లా చూపించే చీర క్రేజ్ అలాంటిది మరి. అందుకే మగువల మనసుల్లో పదిలమైన స్థానంతో- ఎప్పటికప్పుడు నయా ఫ్యాషన్లని కలుపుకుంటూ సరికొత్త కట్టుతో ఆకట్టుకుంటోంది చీర!







చీర అంటే కేవలం ఒక డ్రెస్సు మాత్రమే కాదు, అదొక సంప్రదాయం అంటూ... వేడుక జరిపించి మరీ మన దగ్గర అమ్మాయికి తొలిసారిగా చీర కట్టే పద్ధతిని పాటిస్తుంటారు. పసిపాపాయి నుంచి పెళ్లికూతురు వరకూ చీరతో చెప్పలేని అనుబంధం ఉందంటూ జ్ఞాపకాల్ని నెమరేసుకుంటారు. తరతరాలుగా వస్తున్న ఆ ఇష్టమే- చీరను అమ్మమ్మలు మొదలు అమ్మాయిల దాకా అందరూ మెచ్చే ఏకైక ఫ్యాషన్‌గా మార్చింది. చీర కట్టు సూపర్ లుక్కుతో మెరిపిస్తుందనడంలో ఏమాత్రం సందేహం లేదు కానీ ఆ కట్టే పద్ధతి మాత్రం అందరికీ చేతకాదు. ఆ విషయాన్ని దగ్గర్నుంచి గమనిస్తున్న డిజైనర్లు ఈతరానికి చీరకట్టులోనూ సౌలభ్యాన్ని ఇవ్వాలనే ఉద్దేశంతో ఎన్నో శారీ వెరైటీల్ని తీసుకొస్తున్నారు. ఫ్యూజన్ ట్రెండ్‌ని చీరల్లోనూ చూపిస్తూ డిజైన్ చేస్తున్న ఆ వెస్టర్న్ రకాలేంటో చూసేద్దామా!



కొంగు జారదు!

షైనీ ఫ్యాన్సీ చీర చుట్టి, ఒంటి పొర పెట్టుకుని వేడుకకు వెళితే అదిరిపోతుందంతే! కానీ ఆ స్టైల్‌ని అలాగే కొనసాగించాలంటే కాస్త కష్టమే. అందుకు పరిష్కారంగానే ఈమధ్య 'హ్యాండ్స్ ఫ్రీ' చీరలొచ్చాయి. వీటికి ఎలాస్టిక్ కుచ్చులతో ప్రత్యేకమైన రంధ్రం ఉంటుంది. చీర మొత్తం కట్టుకున్నాక అందులోంచి తలను దూర్చితే చాలు. ఇక్కడ ఫొటోలో చూపించినట్టు హ్యాండ్స్ ఫ్రీ శారీ అయిపోతుంది. హాయిగా ఏ పని చేసుకున్నా చీర కొంగు జారదిక. లేదూ, బ్లౌజు కూడా హైలైట్ అవ్వాలనుకుంటే... అందులోంచి చెయ్యిని మాత్రం బయటకు పెడితే సరి. ఇలా రెండు రకాలుగా కట్టుకునేలా ఉండే ఈ చీరలు- చూడచక్కని డిజైన్లతో శాటిన్, క్రేప్, జార్జెట్ క్లాతుల్లో అందుబాటులో ఉన్నాయి. సింపుల్ శారీతోనే హుందాగా కనిపించాలనుకునే యువతకు మంచి ఛాయిస్ ఇవి!

మెరుపుల్ మెరుపుల్!

రాత్రిపూట పార్టీలూ, ఫంక్షన్లలో అందరి దృష్టినీ ఆకర్షించడానికి చీరల్లో ఇప్పుడు ఓ సరికొత్త ఆప్షన్ వచ్చింది. చమ్కీల చీరల్ని కాస్త పక్కనపెట్టి ఈ 'నియోనరీ శారీ'ల్ని ట్రై చేయొచ్చు. పగలు వెలుతురులో గులాబీ, ఆకుపచ్చ, పసుపు, ఆరెంజ్, నీలం... తదితర రంగుల్లో బోలెడన్ని డిజైన్లలో కనిపించే ఈ చీరలు- చీకట్లో, యూవీ లైట్లలో మాత్రం జిగేల్‌మంటూ కాంతులీనుతాయి. అందుకు కారణం ప్రత్యేకంగా నియాన్ రంగులతోనే ఆ చీరల్ని తయారుచేయడమే! కొత్తదనం కోరుకునే కుర్రకారు కోసమే ఇవి మార్కెట్లో హల్‌చల్ చేస్తున్నాయి. కట్టుకోవడానికీ తేలిగ్గా ఉంటూనే ఏ అలంకరణలూ లేకపోయినా అందరిలో భిన్నంగా నిలిపే ఈ చీర ఎవర్ికైనా నచ్చకుండా ఉంటుందా మరి?

కోట్ వేస్తే... కొత్త లుక్కు!

పట్టుచీర కట్టినా, కాటన్ చీర చుట్టినా... ఒక్కసారిగా చీర అందాన్ని పూర్తిగా మార్చాలనుకుంటే మాత్రం దానిపైన ఒక కోట్ వేస్తే సరిపోతుంది. చీర మోడల్ ఎలా ఉన్నా సరే, సూపర్ లుక్కు వచ్చి తీరుతుంది! ఇదివరకు రకరకాల డ్రెస్సులే అలా పై నుంచి జాకెట్ వేసుకునేలా వస్తే- ఇప్పుడు చీరకీ కోట్ జతై దొరుకుతోంది. వీటిల్లో షార్ట్, లాంగ్ సైజులూ అందుబాటులో ఉన్నాయి. చీరకు విడిగా బ్లౌజ్‌ని ఎలా డిజైన్ చేయించాలన్న ఆలోచనే లేకుండా వీటిల్లో మనకు నప్పే, నచ్చే జాకెట్ ఉన్న రెడీమేడ్ శారీని ఎంచుకుంటే సరి. అలంకరణ కొత్తగా ఉంటుంది, పనీ సులువవుతుంది!

అందమంతా పలాజోతోనే!

ఫ్యాషన్ ప్రపంచాన్ని ఒక ఊపు ఊపేసిన లెగ్గింగ్స్ స్టైల్‌కీ బ్రేక్ ఇచ్చి, ముందు వరుసలోకి చేరింది పలాజో ట్రెండ్. వదులుగా, పై నుంచి కింద వరకూ ఒకేలా ఉండే పలాజోలు చక్కటి లుక్కును తేవడమే కాదు, వేసుకోవడానికి సౌకర్యంగా ఉండటంతో అమ్మాయిల వార్డ్‌రోబుల్లోకి చేరిపోయాయి. అతివలకు అంతగా దగ్గరైన పలాజోని ఇంకాస్త అందంగా మార్చాలనుకుంటూ పలాజో శారీలకు రూపమిచ్చారు డిజైనర్లు. కింద ప్యాంటూ, పైన డిజైనరీ బ్లౌజుతోపాటు చీర కొంగుతో వస్తాయివి.



ఇది లెహెంగా చీర!

అల్మారాలో ఎన్ని రకాల డ్రెస్సులున్నా 'అబ్బా... ఎప్పుడూ అవేనా' అనే టీనేజర్లు కొత్త ఫ్యాషన్లను వెతుకుతుంటారు. మీరూ ఆ కోవకే చెందుతారా... అయితే ఈసారి వేడుకకు లెహెంగా చీరతో తయారవ్వండి. చీరా, లంగాఓణీల మోడ్రన్ వెర్షన్ ఇది. కింద పూర్తిగా లెహెంగాలాగే ఉన్నా బ్లౌజూ, పల్లూ మాత్రం ఎంతో ప్రత్యేకంగా ఉంటాయి. క్రేప్, సిల్క్, శాటిన్, ఆర్గంజా, జార్జెట్... ఇలా అన్ని రకాల క్లాతుల్లో వస్తున్నాయి. సంప్రదాయబద్ధంగా కనిపిస్తూనే, మోడ్రన్ అమ్మాయిగా మెప్పించాలనుకునేవాళ్లు ఈ ఫ్యాషన్‌ని ఫాలో అయిపోవచ్చు!

ధోతీ చీర నచ్చిందా!

కుర్తీ, అనార్కలీ, లాంగ్‌ఫ్రాక్, గాగ్రా, లంగాఓణీ డ్రెస్సులు కాకుండా సెలబ్రిటీలు మాత్రం కొత్తకొత్త డిజైనర్‌వేర్‌తో తళుక్కుమంటూ కనిపిస్తుంటారు. అలా తారల్ని మెరిపించిన ఫ్యాషన్లు కొన్ని బాగా ట్రెండ్ అవుతూ మార్కెట్లోనూ దిగిపోతుంటాయి. ఇక్కడున్న ధోతీ చీర డ్రెస్సులూ కూడా అలా ఫేమస్ అయినవే! సంప్రదాయ చీరకే ఆధునిక టచ్ ఇస్తూ తీసుకొచ్చిన ఈ చీర డ్రెస్సులు- ప్రతి ఒక్కరి ఫ్యాషన్లలో భాగం అయ్యాయి. ఈమధ్య పిల్లలూ, అమ్మలూ మ్యాచింగ్ వేసుకునేలా 'మదర్ అండ్ డాటర్ ధోతీ శారీలు' కూడా బోలెడన్ని వెరైటీల్లో దొరుకుతున్నాయి.



ఎన్ని రకాలో...

సరికొత్త డిజైన్లతో కుచ్చుల రఫుల్ చీరలూ, పాకెట్ శారీలూ, డబుల్ పల్లూ శారీల్లాంటివెన్నో వస్తున్నాయి. ఇంకా చీర స్టైప్స్- కుచ్చిళ్లు కుట్టేసిన ప్రీప్లేటెడ్ రెడీమేడ్ శారీల హంగామా కూడా బాగానే నడుస్తోంది. టీషర్ట్, జిప్ చీరల పేర్లతో అన్ని రకాల మెటీరియల్స్‌తో మార్కెట్లో కనిపిస్తున్నాయివి. అలా డ్రెస్సులా వేసుకుంటే క్షణాల్లో చీర సింగారం పూర్తవుతుంది. ఇవేకాదు... నచ్చినట్టు చీరను తయారు చేసుకునే ఆప్షన్‌నీ చాలా కంపెనీలు అందుబాటులోకి తీసుకొచ్చాయి. కావాలంటే చీర అంచు మీద మన పేర్లనూ, ఇష్టమైన కొటేషన్‌నీ డిజైన్ చేసుకోవచ్చు. ఇవండీ చీరల్లోని కొంగొత్త ఫ్యాషన్ ముచ్చట్లు!

'ఇప్పుడు చీర కట్టేంత టైం లేదే, చీర ఇష్టమే- కానీ ఎక్కువసేపు ఉండలేను, శారీతోనే కొత్తగా ఎలా కనిపించాలి...' ఇలాంటి బోలెడు సందేహాలన్నింటికీ చక్కటి పరిష్కారం చూపిస్తున్నాయి ఈ వెరైటీ చీరలు. మరెందుకాలస్యం ఈ నయా శారీ ట్రెండ్స్‌తో ముస్తాబై, పండుగలకీ, వేడుకలకీ ఓ కొత్త కళ తెచ్చేయండి! ★

(c) eenadu

అవీ ఇవీ

అక్కడ నెలనెలా...పండగే!



దేశమంతా దసరా నవరాత్రుల ఉత్సవాలని జరుపుకునే రోజులివి. 'అరె, తొమ్మిది రోజులేనా... ఏడాదంతా ఎందుకు చేసుకోకూడదు?!' అని ప్రశ్నిస్తుంటారు కొందరు గడుగ్గాయిలు. చిన్నారులే కాదు... పెద్దవాళ్లు ఇలాగే ఆలోచించారేమో కేరళలోని ఆ ఊళ్లో. అందుకే ఆ రాష్ట్రమంతా ఏడాదికి ఒక్కసారే జరుపుకునే 'ఓనమ్' పండుగని ఆ పల్లెలో మాత్రం ఏడాదిపొడవునా నిర్వహిస్తున్నారు. కేరళలో ఏటా చింగం(సింహం) నెల(అంటే శ్రావణ మాసం)లో తిరువోనమ్ (శ్రవణా) నక్షత్రం రోజున జరుపుకునే పెద్ద పండగ ఓనమ్. వాళ్లకిది రాష్ట్ర పండగ కూడా! కానీ కోట్టయం జిల్లాలోని వెంబిన్‌కుళంగర అన్న గ్రామంలో మాత్రం నెలనెలా నిర్వహిస్తున్నారు. అంటే ప్రతి శ్రవణా నక్షత్రం రోజునా అక్కడ ఓనమ్ పండగే అన్నమాట. ఆ రోజు ఎన్ని పనులున్నా మానుకుని ఊరివాళ్లందరూ ఉదయం ఆలయ పూజలో పాల్గొంటారు. మతాలకతీతంగా ఊరందరూ కలిసి 'సద్య' అనే భారీ విందు కోసం వంటావార్పులో పాల్గొంటారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనం చేస్తారు. ఇలా... నెలనెలా విందుకయ్యే ఖర్చుని ఏదో ఒక కుటుంబమే భరిస్తుంది. ఆ బాధ్యత తీసుకోవడానికీ అక్కడ విపరీతమైన పోటీ ఉంటోంది. ఎంతగా అంటే... వచ్చే 11 ఏళ్లపాటు ఏయే కుటుంబాలు ఈ బాధ్యత తీసుకోవాలో ముందుగానే నిర్ణయమైపోయేటంతగా!



ధాన్యాలు... ఐదేళ్లపాటు సేఫ్!



ప్రతి వ్యవసాయ సమాజమూ... విత్తనాలనీ ధాన్యాలనీ భవిష్యత్తు కోసం భద్రంగా దాచుకోవడానికి ఓ పద్ధతి అనుసరిస్తూ ఉంటుంది. మనదగ్గరైతే ఒకప్పుడు పేడ రాసి వెదురు బుట్టల్లో దాస్తుండేవారు. ఇటీవలి కాలంలో రసాయనాలూ శీతలీకరణ వసతుల సాయంతోనూ భద్రపరుస్తున్నారు. పద్ధతి ఏదైనా సరే, ఈ ధాన్యాలు రెండేళ్లకన్నా ఎక్కువకాలం ఆరోగ్యంగా ఉండవు. కానీ ఆంధ్రప్రదేశ్ అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు ఏజెన్సీలో ఉంటున్న మురియా గిరిజనులు... దాదాపు ఐదేళ్లపాటు విత్తనాలనీ ధాన్యాలనీ చెక్కుచెదరకుండా ఉంచుకోగలుగుతున్నారట. ఇందుకోసం వాళ్లు ఉపయోగిస్తున్న 'దెడా' అన్న పద్ధతి ఇటీవల అక్కడ జరిగిన ఓ ఆహార ఉత్సవంతో వెలుగులోకి వచ్చింది! అడవిలో దొరికే వివిధ ఆకుల్ని పొరలుగా పేర్చే పద్ధతి వీళ్లది. విస్తళ్లకి వాడే అడ్డాకులకి కొమ్ములు కాల్చిన బూడిదని పూసి తొలి పొరని తయారుచేస్తారట. దానిపైన నిమ్మ ఆకుల్ని పేర్చి, ఆపైన మరో పొర ఆకుల్ని ఉంచి... అందులో విత్తనాలని ఉంచి దాన్ని కట్టి ఓ కుండలా మార్చుకుంటారట. అలా దాచిన ధాన్యాలని ఐదేళ్ల తర్వాత కూడా సాగు చేసుకుంటారట వీళ్లు...!

తిరుప్పూరు బట్టలు... మ్యానకిన్‌లుగా!

తనిష్క్... మనదేశంలోని అతిపెద్ద నగల దుకాణాల బ్రాండ్‌లలో ఒకటి! ప్రపంచవ్యాప్తంగానూ దానికి షాపులున్నాయి. వాటన్నింటా కలిపి లక్షలాది మ్యానకిన్‌లని వాడుతుంటారు. 'నగల సంగతి కావాలికానీ మ్యానకిన్‌ల గురించి ఎందుకూ' అంటారా... మిగతా సంస్థలు వీటి కోసం ప్లాస్టిక్‌ని వాడితే తనిష్క్ మాత్రం పేపర్‌గుజ్జుతో చేసినవాటినే వాడుతుంది. ఈ పేపర్ మ్యానకిన్‌లు అన్నీ తిరుప్పూరులో తయారవుతాయి. ప్రపంచంలో పలు టాప్ బ్రాండ్‌ల టీ-షర్టుల్ని తిరుప్పూరులోనే తయారుచేస్తారన్న విషయం వినే ఉంటారు. వాటి తయారీలో భాగంగా... కోట్ల టన్నుల్లో కుప్పలుగా పోగయ్యే గుడ్డపేలికల్ని ఏం చేయాలో తెలియక తలలు పట్టుకునేవారట అక్కడ కంపెనీల యజమానులు. ఆ కంపెనీల్లోని ఒకదాంట్లో కూలీలుగా పనిచేస్తూ వచ్చిన మణి, అముద దంపతులు అందుకో పరిష్కారం కనిపెట్టారు. ఆ బట్టల్ని పేపర్‌లుగా చేసి వాటి గుజ్జుతో మ్యానకిన్‌లు తయారుచేసే సాంకేతికతని కనిపెట్టారు వాళ్లు! 'జ్యోతి ఇండస్ట్రీస్' అనే వాళ్ల సంస్థ- ఒక్క తనిష్క్‌కి మాత్రమే కాదు, ఆదిత్య బిర్లా లైఫ్‌స్టైల్ బ్రాండ్స్‌కీ ప్రముఖ బహుళజాతి డెకత్లాన్‌కీ వీళ్లే మ్యానకిన్‌లని అందిస్తోందట.





వర్షపు నీరే తాగుతున్నారు!



అయితే ప్యూరిఫయర్‌లు వాడుకోవడం కాకుంటే వాటర్ క్యాన్‌లని ఉపయోగించడం... ఇప్పుడు నగరాలకే కాదు గ్రామాలకూ పాకింది! వీటితో మనం కాలుష్యంలేని నీటినే తాగుతున్నా... వాటిలోని సహజ ఖనిజాలని కోల్పోతున్నామని వైద్యులు చెబుతున్నారు. పైగా ఈ నీళ్లని వడకట్టే 'ఆర్‌ఓ' పద్ధతి పర్యావరణానికి మంచిది కాదనీ హెచ్చరిస్తున్నారు. కాకపోతే, ఏ కొందరో తప్ప అందరూ ఈ విషయాల గురించి పెద్దగా ఆలోచించట్లేదు. ఆ కొందరిలో... నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో ఉన్న ఆ 20 కుటుంబాలవాళ్లు ఉన్నారు! అటు శరీరానికి ఖనిజాలు అందేలా ఇటు పర్యావరణానికి మేలు జరిగేలా గత పదేళ్లుగా కేవలం వర్షపు నీరే తాగుతున్నారు వాళ్లు! వాటితోనే వంటావార్పులు చేస్తున్నారు. ఈ పట్టణానికి చెందిన గోవింద్‌వార్ ప్రవీణ్ కుటుంబంతో ఈ పద్ధతి మొదలైంది. ముందుగా 28 వేల లీటర్ల సామర్థ్యమున్న-ఎండా గాలీ సోకే అవకాశమే లేని- సంపుని నిర్మించుకుందట ఆ కుటుంబం. వర్షాకాలంలో డాబాపైనా చుట్టుపక్కలా పడే వర్షపునీరు నేరుగా సంపులోకి వెళ్లేలా చేసి... ఏడాదంతా వాటినే వాడుతున్నారు. మూడేళ్లపాటు- నీటి వల్ల ప్రవీణ్ కుటుంబానికి ఏ అనారోగ్యమూ లేకపోవడంతో... మెల్లగా చుట్టుపక్కలవాళ్లూ అనుసరించారు. అలా వర్షపునీటిని వాడుతున్నవాళ్ల సంఖ్య 20కి చేరింది ఇప్పుడు!

(c) eenadu



అమ్మ వదిలేసిన ఆ అబ్బాయి... ప్రపంచ కుబేరుడు!



కొన్ని జ్ఞాపకాలు కత్తికంటే పదునుగా ఉంటాయి. తలుచుకున్న ప్రతిసారీ మనసుని రంపపు కోత కోస్తాయి. టీనేజీలో లారీఎలెసన్‌కి కూడా ఇదే పరిస్థితి ఎదురైంది. కళ్లు మూసినా, తెరిచినా అమ్మ లేదన్న చేదు జ్ఞాపకమే! దాంతో చదువుని పక్కన పెట్టాడు, డ్రాపవుట్ అన్న ముద్ర వేయించుకున్నాడు. ఒంటరితనం నుంచి బయటపడేందుకు అతను చేసిన ప్రయత్నమే ప్రపంచ కోటీశ్వరుల జాబితాలో నం.1 స్థానంలో ఉన్న ఎలాన్‌మస్క్‌కి గట్టిపోటీనిచ్చేలా చేసింది. టెక్ దిగ్గజ సంస్థ ఒరాకిల్ సీటీఓ లారీఎలెసన్ గెలుపు కథ ఇది...

ప్రాణమైనా వదులుతుందేమో కానీ పేగు తెంచుకుని పుట్టిన బిడ్డని వదులుకోవాలనుకోదు ఏ తల్లైనా! కానీ, 19 ఏళ్ల ఫ్లోరెన్స్‌కి అటువంటి పరిస్థితే ఎదురైంది. తన తొమ్మిది నెలల కొడుకు లారీ న్యుమోనియాతో బాధపడుతూ, మృత్యువుతో పోరాడుతున్నాడు. ఆ పిల్లాడిని బతికించుకోవడానికి తన దగ్గర డబ్బుల్లేవు. ఇక, ఆ బిడ్డ తండ్రి ఒక సైనికుడు... ఫ్లోరెన్స్‌ని పెళ్లిచేసుకోలేదు కాబట్టి ఆ బిడ్డ బాధ్యత నాది కాదన్నాడు. పెళ్లికాకుండానే బిడ్డని కన్నదన్న నిందలూ, పేదరికం మధ్య ఫ్లోరెన్స్... ఆ బిడ్డని తన దగ్గర బంధువులకి ఇచ్చేయాల్సి వచ్చింది. అలా లారీ... పిల్లలు లేని లిలియన్, లూయీ ఎలెసన్‌ల దగ్గర వాళ్ల బిడ్డగా పెరిగాడు. లారీ పెంపుడు తండ్రి లూయీ అంత వరకూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవాడు. కానీ అమెరికాలో తలెత్తిన మహా ఆర్థికమాంద్యం కారణంగా బాగా నష్టపోయాడు. దాంతో కుటుంబాన్ని చిన్న ఇరుకు ఇంట్లోకి మార్చాడు. తన ఓటమిని కోపంగా మార్చుకున్న లూయీ కొడుకుని ఎప్పుడూ ద్వేషిస్తూ, 'నువ్వు ఎందుకూ పనికి రావు... ఈ జన్మకి నువ్వేమీ సాధించలేవు, నష్టజాతకుడివి' అంటూ చిన్నారి లారీని తిడుతూనే ఉండేవాడు. తండ్రి తనను ఇంతలా ఎందుకు ద్వేషిస్తున్నాడో అర్థంకాని అమాయకత్వం పన్నెండేళ్ల లారీది. తండ్రి కటువైన మాటలకి కన్నీళ్లు పెట్టుకుంటుంటే పుస్తకాల దుకాణంలో పనిచేస్తున్న తల్లి లిలియన్ అక్కున చేర్చుకుని, ఓదార్చేది. కన్నీళ్లు తుడుస్తూ, తనకొచ్చే కొద్దిపాటి జీతంతోనే కొడుకు కలలని తీర్చడానికి ప్రయత్నించేది. తర్వాత్తర్వాత లారీకి తన అసలు తల్లిదండ్రుల గురించి తెలిసినా... తన పెంపుడు తల్లి లిలియన్ ఒక్కతే చాలనుకునేవాడు. అమ్మ తర్వాత తనకి అంతగా ఇష్టమైన మరో ప్రపంచం లెక్కలు. అవును, లెక్కలూ- సైన్స్ అంటే ప్రాణం పెట్టే లారీ ఎలెసన్‌కి స్కూల్లో 'బెస్ట్ సైన్స్ స్టూడెంట్'గా పేరుంది. అలాంటి లారీ యూనివర్సిటీ ఆఫ్ ఇలినాయిస్‌లో డిగ్రీ ఫైనలియర్ పరీక్షలు రాస్తున్నప్పుడు... అనారోగ్యంతో లిలియన్ చనిపోయిందన్న పిడుగులాంటి వార్త విన్నాడు. ఎంత ప్రయత్నించినా, కన్నీళ్లతో పేపర్లు తడిచి పోతున్నాయే కానీ పెన్నుని కదిలించడం అతని వల్ల కాలేదు. దాంతో పరీక్షలు రాయలేకపోయాడు. మరోవైపు 'చెప్పాగా... నువ్వు దేనికీ పనికిరావు అంటూ' పెంపుడు తండ్రి సూటిపోటి మాటలు.

చదువుని వదిలేసి...

తండ్రికి దూరంగా వెళ్లాలని చికాగో యూనివర్సిటీలో చేరాడు. అక్కడా అంతే... అమ్మ జ్ఞాపకాలే వెంటాడేవి. ఏదైనా పనిలో పడితేనన్నా ఆమెను మరిచిపోవచ్చని కాలిఫోర్నియా వెళ్లాడు. అక్కడ చిన్నాచితకా పనులుచేస్తూ... రోడ్డువారన దొరికే ఫాస్ట్‌ఫుడ్‌తో కడుపు నింపుకునేవాడు. ప్రోగ్రామింగ్ కోర్సుల్లో చేరేంత డబ్బులేక, పుస్తకాలు కొని సొంతంగా నేర్చుకున్నాడు. ఇంటి కరెంట్‌బిల్లు కూడా కట్టలేని పరిస్థితి. 'నేను ఏసీ, టీవీ లేకుండా ఉంటాను కానీ... నా కంప్యూటర్ లేకపోతే బతకలేను, బిల్లులో 10శాతం చెల్లిస్తా, ప్లీజ్ కరెంట్ ఉంచండి' అంటూ అధికారులను ప్రాధేయపడేవాడు. అలా పదేళ్లపాటు ఎన్నో కష్టాలుపడ్డ లారీ జీవితంలో ఏమ్‌పెక్స్ కార్పొరేషన్‌లో ఉద్యోగిగా చేరాకనే స్థిరత్వం మొదలైంది. సొంతంగా తనూ ఓ డేటాబేస్ సంస్థని ప్రారంభించాలనుకున్నాడు. దాచుకున్న కొద్దిపాటి డబ్బుతో 'సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ లాబొరేటరీస్' అనే డేటాబేస్ సొల్యూషన్స్ సంస్థని మొదలుపెట్టాడు. ఎనిమిది మంది ఉద్యోగులతో మొదలైన ఈ సంస్థ మొదట్లో ఎన్నో ఒడుదొడుకులని ఎదుర్కొంది. పెట్టుబడులు పెట్టి ప్రోత్సహించేవారు లేరు. ఒక దశలో సంస్థ షేర్లు 80శాతం పడిపోయాయి. కీలకమైన కోర్‌టీమ్‌ని వదులుకోవాల్సి వచ్చింది. ఈ సమస్యలన్నింటినీ ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటూ తన సంస్థని ఒరాకిల్ కార్పొరేషన్‌గా మార్చి ప్రపంచంలోనే పేరున్న టెక్‌కంపెనీగా తీర్చిదిద్దాడు లారీ. 'డబ్బులు సంపాదించాలని నేనీ సంస్థను మొదలుపెట్టలేదు. నాకు నచ్చిన వాతావరణంలో ఇష్టంగా పనిచేయాలని మొదలుపెట్టా'నని లారీ... క్లౌడ్ సర్వీసులూ, డేటాబేస్ సొల్యూషన్స్, హార్డ్‌వేర్ ఉత్పత్తులూ అందిస్తూ ఒరాకిల్ సంస్థని లక్షన్నరమంది ఉద్యోగులతో 140 దేశాల్లో విస్తరించాడు. 34 లక్షలకోట్ల రూపాయల సంపదతో నం.1 స్థానంలో ఉన్న ఎలాన్‌మస్క్‌ని కూడా ఒక దశలో వెనక్కినెట్టి, అతనికి గట్టి పోటీనిస్తున్నాడు. 'రాత్రికి రాత్రే ఏ విజయాన్నీ సాధించలేం.... ఓర్పూ, నిదానం రెండూ ఉండాలి. రిస్క్ తీసుకోవాలి, కానీ దానికో లెక్క ఉండాలి' అనే లారీకి క్రీడాకారుడిగానూ మంచి పేరుంది. సెయిలింగ్, రేసింగ్ అంటే ఇష్టపడే లారీ వ్యాపారంలోనైనా, క్రీడల్లోనైనా పోటీపడటాన్ని ఇష్టపడతాడు. ఇంతకీ లారీ వయసు ఇప్పుడు ఎంతో తెలుసా...81! ★



(c) eenadu

స్లీపింగ్ పిల్

– జీవీ రమేష్

సెక్యూరిటీ గార్డ్ సెల్యూట్‌ని ఠీవిగా అందుకుంటూ, ఖరీదైన కారు ఆ కార్పొరేట్ ఆఫీసు ముందు ఆగింది. జగదీష్ కారు దిగి హుందాగా ఆఫీసులో అడుగు పెట్టాడు. ఉద్యోగుల అభివాదాలను అందుకుంటూ తన ఛాంబర్‌లోకి వెళ్లాడు.

‘నా తమ్ముడు మళ్లీ గొడవ పడ్డాడు. నన్ను కొట్టడానికి వచ్చాడు. నా మరదలు అడ్డొ ఎనకేసుకు వస్తాది. ఆళ్ళ సేతులిరిగిపోనూ, మాయరోగం ఆళ్ళని కమ్మేయనూ’ బయట నుంచి మాటలు గట్టిగా వినిపిస్తున్నాయి.

అటెండర్ కాంతమ్మ గొంతు అది.

తనంతే... బాధొస్తే ఏడుస్తుంది. కోపమొస్తే అరుస్తుంది. ఆనందంగా ఉంటే కూనిరాగాలు తీస్తుంది. గలగల మాట్లాడుతూ ఉంటుంది.

‘తనుంటే గోలగోలగా ఉంటుంది’ అంటాడు జగదీష్.

‘కానీ సందడిగా ఉంటుం’దంటారు స్టాఫ్.

సీట్లో కూర్చున్న ఐదు నిమిషాలకి అసిస్టెంట్ ప్రభు వచ్చాడు.

“ఉదయం పది గంటలకు డిస్ట్రిబ్యూటర్స్ మీటింగ్ ఉంది సర్. మధ్యాహ్నం మూడు గంటలకు సేల్స్ ఆఫీసర్ల ఫైనల్ ఇంటర్వ్యూ ఉంది.”

“ఇంటర్వ్యూకి ఎంతమంది హాజరవుతున్నారు?”

“పదిమంది సర్.”

‘మనకి ఇద్దరు కావాలి. ఎక్స్‌పీరియన్స్ ఉంటే మరో ఇద్దరిని కూడా తీసుకోవచ్చు’ స్వగతంలో అనుకున్నాడు.

జగదీష్ ఓ బహుళజాతి కాస్మొటిక్ కంపెనీకి సీనియర్ మార్కెటింగ్ మేనేజర్. రెండు తెలుగు రాష్ట్రాలకు అతను హెడ్. లక్షల్లో జీతం, కంపెనీ కారు. ఇతరత్రా అలవెన్సులు కలిసి చాలానే సంపాదిస్తున్నాడు. ముప్పయ్యేళ్ళు నిండకుండానే ఈ స్థాయికి చేరాడు. మార్కెటింగ్ రంగంలోకి రావాలనుకునే వాళ్ళకి అతను ఆదర్శం.

ఫైనల్ ఇంటర్వ్యూకి చేరిన అభ్యర్థుల జాబితాతోపాటు వాళ్ళ బయోడేటా ఫైల్ టేబుల్ మీద కనిపించింది. అందులోంచి లిస్టు బయటకు తీసి చదువుతూ, ఒక పేరు దగ్గర ఆగిపోయాడు.

వెంటనే బయోడేటాలోంచి అతని వివరాలు తీసి చూశాడు. రాజశేఖర్... తను అనుకున్న వ్యక్తే. చివరకు తన దగ్గరకు ఇంటర్వ్యూకి వచ్చాడన్నమాట. పెదాలపై వ్యంగ్యంతో కూడిన నవ్వు మెరిసింది. సాధారణంగా జగదీష్ నవ్వడు. ఇంట్లో కూడా సీరియస్‌గానే ఉంటాడు. అలవిమాలిన ఆలోచనలు అతని బుర్రను మేఘంలా కమ్మేస్తుంటాయి.

డిస్ట్రిబ్యూటర్లతో మీటింగ్ దాదాపు మూడు గంటలు కొనసాగింది.

“సార్, మేడమ్ వచ్చారు” ఒంటి గంట అవుతుండగా ప్రభు వచ్చి చెప్పాడు.

మధ్యాహ్నం తన ఫ్రెండ్ కొడుకు పుట్టినరోజు పార్టీ ఉంది. ఓ ఫైవ్ స్టార్ హోటల్లో లంచ్‌కి వెళ్ళాలి. అందుకే సుమ వచ్చింది. మీటింగ్‌లో పడి ఆ విషయం మరచిపోయాడు. సీసీ కెమెరా వైపు చూశాడు. తన భార్య విజిటర్స్ గ్యాలరీలో ఉంది. ఆమె ఎదురుగా ఓ మహిళ, పక్కనే ఓ అమ్మాయీ ఉన్నారు.

మీటింగ్ ముగించి విజిటర్స్ గ్యాలరీకి వచ్చాడు.

“జగదీష్ బాగున్నావా?” సుమతో మాట్లాడుతున్న మహిళ అతన్ని పలకరించింది. ఆమె వైపు తేరిపార చూశాడు. ఆమె తన చిన్నాన్న భార్య శాంత. చివరిసారి పదిహేనేళ్ళ కిందట చూశాడు.

“కీర్తీ... ఇతనే మీ అన్నయ్య జగదీష్” తన కూతురికి పరిచయం చేసింది.

ఆ అమ్మాయి పలకరింపుగా నవ్వింది. తల్లీ కూతుళ్ళ ముఖాల్లో అలసట కనిపిస్తోంది. అంతకు మించిన దిగులు కళ్ళల్లో ఉంది.



వేసుకున్న దుస్తులు పేదరికాన్ని ఎత్తి చూపుతున్నాయి.

కీర్తిని చిన్నప్పుడు ఎత్తుకుని ఆడించాడు. అప్పట్లో ఆ అమ్మాయికి రెండు, మూడేళ్ళు ఉంటాయేమో. అతన్ని చూడగానే వాళ్ళిద్దరి ముఖాల్లో ఏదో ఆశ చిగురించింది.

కానీ అతనికి తన గతం కనిపించింది. తన తండ్రి పరిస్థితి బాగున్న రోజుల్లో చిన్నాన్నే కాదు, చాలామంది తమ ఇంట్లో ఉండేవారు. తన తండ్రి అప్పో సొప్పో చేసి వాళ్ళని పోషించేవాడు.

తన తండ్రి దాయాదుల పిల్లలు కూడా తమ ఇంట్లోనే ఉండి చదువుకునేవారు. వాళ్ళంతా స్థిరపడిన తర్వాత తమను వీడి వెళ్ళిపోయారు. ఆ మనుషుల తత్వమే అంత అని సరిపెట్టుకోగలడు... కానీ చిన్నాన్నను మాత్రం ఎన్నటికీ క్షమించలేడు.

నాన్న చిన్నప్పుడే తన తల్లిదండ్రులను కోల్పోయారు. చిన్నాన్నని ఆయన కంటికి రెప్పలా కాపాడుకున్నారు. డిగ్రీ అయిన తర్వాత వ్యాపారం చేస్తానంటే అప్పు చేసి మరీ డబ్బులిచ్చారు. వ్యాపారం పుంజుకునే వరకూ పిన్నీ, కీర్తీ కూడా తమ ఇంట్లోనే ఉండేవారు. తాను పదో తరగతిలో ఉన్నప్పుడు నాన్నకి క్యాన్సర్ అని తేలింది.

“ఈ సమయంలో మీకెందుకు అన్నయ్యా మా భారం” అంటూ చిన్నాన్న, తన కుటుంబాన్ని తీసుకుని వెళ్ళిపోయాడు. ఆ తర్వాత నాన్న ఎక్కువకాలం బతకలేదు.

ఇంట్లో పడి తిన్న వాళ్ళెవరూ తమ కష్టసమయంలో అక్కరకు రాలేదు. తండ్రి తన చేతుల్లో ఒరిగిపోయిన రోజు చేతిలో చిల్లిగవ్వ లేదు. సరైన వైద్యం చేయించి ఉంటే, మరి కొన్నాళ్ళపాటు ఆయన బతకగలిగేవారనే గిల్టీ ఫీలింగ్ జగదీష్‌కి ఉండిపోయింది. డబ్బు విలువ అప్పుడతనికి బాగా తెలిసింది. తన తండ్రి అపాత్రదానం చేసి సర్వం కోల్పోయాడని అర్థమైంది. తన తల్లి కూడా ఏనాడూ ఆయనకు అడ్డు చెప్పలేదు. ఫలితంగా తమకు కటిక దరిద్రం మిగిలింది.

ట్యూషన్లు చెబుతూ డిగ్రీ వరకూ చదువుకున్నాడు. పీజీలో మంచి కాలేజీలో సీటు వచ్చింది. ఫీజు ఎక్కువ. వచ్చిన అవకాశాన్ని వదులుకోకూడదని తను ఇంట్లో కొన్నాళ్ళు ఆశ్రయం తీసుకున్న ఓ బంధువుని అప్పు అడిగాడు.

‘మీ నాన్న మేలుని ఎప్పటికీ మరిచిపోలేనురా. అందరికీ ఐదు రూపాయలు వడ్డీ తీసుకుంటున్నాను. నువ్వు రెండు రూపాయలు ఇవ్వు చాలు’ అన్నాడతను. ‘రూపాయి వడ్డీ ఇస్తాను మామా’ అంటే ‘తర్వాత మాట్లాడదా’మని ఫోన్ పెట్టేశాడు. ఆ తర్వాతెప్పుడూ అతను ఫోన్ చేయలేదు.

ఈ సంఘటనలన్నీ జగదీష్ కోపాన్నీ ఎదగాలన్న కసినీ పెంచాయి. బంధువులను అస్సలు నమ్మకూడదని ఫిక్స్ అయిపోయాడు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేయాలనే ఆలోచనని పక్కన పెట్టాడు. ఇరవై ఒక్క ఏళ్ళకే మార్కెటింగ్ రంగంలోకి దిగాడు. అంచెలంచెలుగా ఎదిగాడు. పెళ్ళి చేసుకుని, నిలదొక్కుకునే సమయానికి తల్లి కూడా చనిపోయింది. తన కష్టాలను చూసిన తల్లి, తన విజయాన్ని చూడలేకపోయినందుకు ఎప్పుడూ బాధపడుతుంటాడు.

(c) eenadu

ఇంటి నుంచి వెళ్ళిపోయిన చిన్నాన్న, తన తండ్రి చనిపోయినప్పుడు... మొక్కుబడిగా వచ్చాడు. అతి కష్టం మీద నాలుగు రోజులున్నాడు. బంధువుల ఫంక్షన్లలో కనిపించినా అంటీ ముట్టనట్లు ఉండేవాడు.

"మీ చిన్నాన్నకి ఒంట్లో బాగాలేదట. ఆస్పత్రిలో ఉన్నారు. మీరు ఇక్కడ ఉన్నారని తెలిసి మిమ్మల్ని కలవడానికి వచ్చారు" సుమ మాటలతో గతం నుంచి బయటకు వచ్చాడు.

"వ్యాపారంలో నష్టపోయారు. అప్పులపాలై, ఊళ్ళో తలెత్తుకోలేక ఇక్కడకు వచ్చేశారు. పాపం వీళ్ళు చాలా ఇబ్బందులు పడుతున్నారండీ" తన భార్య వాళ్ళపై అంత జాలీ, అభిమానం చూపించడం జగదీష్‌కి నచ్చలేదు.

"ఇప్పటికి గుర్తొచ్చానన్నమాట మీకు. సంతోషం! సుమా పద, టైమవుతోంది" అంటూ కారువైపు నడిచాడు. ఈ మాట వినగానే అక్కడున్న ఇద్దరి ముఖాలూ పాలిపోయాయి.

వాళ్ళవైపు నిస్సహాయంగా చూస్తూ సుమ అతని వెంట నడిచింది.

జగదీష్ కారు డ్రైవ్ చేస్తున్నాడు, మనసు మాత్రం ప్రశాంతంగా లేదు. సుమకి ఆ విషయం తెలుసు. చిన్న వయసులో తగిలిన ఎదురు దెబ్బలు అతనిలోని మానవతా కోణాన్ని పూర్తిగా మరుగున పడేలా చేశాయి. బంధువుల మీద కోపం, వ్యతిరేకతా తీవ్రంగా పెంచుకున్నాడు. డబ్బు లేకపోవడం వల్లే తన తల్లిదండ్రులని కోల్పోయాననీ అవసరానికి ఏ ఒక్కరూ అక్కరకు రాలేదనీ పగతో రగిలిపోతున్నాడు. ఇతరుల కోణం నుంచి ఆలోచించడం మానేశాడు. తనకు వ్యతిరేకంగా ఏం జరిగినా, దానిని పూర్తిగా నెగెటివ్‌గా తీసుకుంటాడు. ఫలితంగా ప్రశాంతతను కోల్పోతున్నాడు. రాత్రి పడుకోబోయే ముందు నిద్రమాత్ర వేస్తే కానీ కంటినిండా కునుకు పట్టదు. భర్తను చూస్తే సుమకి భయం వేస్తుంది. బాధపెట్టే జ్ఞాపకాలూ తన దృక్కోణమే కరెక్ట్ అనే లక్షణాలను అతని నుంచి దూరం చేయడానికి ప్రయత్నించింది. కానీ ఆమె తపనంతా నీటిమీద రాతయింది.

ఫ్రెండ్ ఇచ్చిన పార్టీలో కూడా జగదీష్ మామూలు మనిషి కాలేకపోయాడు. ఎక్కువసేపు ఉండలేకపోయాడు కూడా. నాలుగు మెతుకులు తిని, సుమని ఇంటి దగ్గర దించేసి ఆఫీసుకు వెళ్ళిపోయాడు. సీట్లో కూర్చున్నాడు కానీ, ఆలోచనల ప్రవాహానికి కళ్ళెం వేయలేకపోతున్నాడు. ఎదురుగా ఇంటర్వ్యూ చేయాల్సిన అభ్యర్థుల జాబితా కనిపించింది. ఆ ఫైల్ తెరవగానే కళ్ళు రాజశేఖర్ పేరు మీదకి వెళ్లాయి.

తొందరగా మంచి స్థాయికి చేరవచ్చని, ఆర్థికంగా కూడా బాగుంటుందనే ఉద్దేశంతో జగదీష్ మార్కెటింగ్ రంగాన్ని ఎంచుకున్నాడు. రాజశేఖర్ తన కొలీగ్. చాలా చురుగ్గా ఉండేవాడు. ఎంత కష్టపడ్డా, పని విషయంలో ఎప్పుడూ రాజశేఖర్‌దే పైచేయి అయ్యేది. ఇద్దరి మధ్యా అనధికారిక పోటీ ఉండేది.

'నీ కంటే రాజశేఖర్ అన్ని విషయాల్లో పాజిటివ్‌గా ఉంటాడు. తన బలహీనతలను అంగీకరించగలడు. తనపై వచ్చిన విమర్శలకు సానుకూలంగా స్పందిస్తాడు' మేనేజర్ ఓ రోజు చెప్పాడు. తన బలహీనతలను చెప్పకనే చెప్పాడాయన.

జగదీష్ వైఖరిలో మార్పు రాకపోయినా, రాత్రీ పగలూ కష్టపడ్డాడు. ఏడాదిలోనే రాజశేఖర్‌కి పోటీ ఇచ్చే స్థాయికి వెళ్ళాడు. ఇద్దరూ స్నేహంగా ఉన్నట్లు కనిపించినా, వృత్తిపరమైన పోటీ వల్ల ప్రత్యర్థులుగా మారిపోయారు. కానీ రాజశేఖర్‌ని ప్రమోషన్ తొందరగా వరించింది.

పుండు మీద కారం చల్లినట్లుగా తనని రాజశేఖర్ టీమ్‌లో పనిచేయాలని మేనేజ్‌మెంట్ సూచించింది. రాజశేఖర్ తనతో బాగానే ఉండేవాడు. తన మాటకి విలువ ఇచ్చేవాడు. కానీ జగదీష్ అహం దెబ్బతింది. ఉద్యోగం మానేసి, వేరే కంపెనీకి వెళ్ళిపోయాడు. అకారణంగా రాజశేఖర్ మీద పెంచుకున్న ద్వేషం ఇప్పటికీ కొనసాగుతోంది.



ఎనిమిదేళ్ళ తర్వాత అదే రాజశేఖర్ జగదీష్ దగ్గర ఇంటర్వ్యూకి వచ్చాడు. పేరు చూడగానే ఉద్యోగం ఇవ్వకూడదనే నిర్ణయించుకున్నాడు. కాకపోతే తన స్థాయిని అతనికి చూపించి, రిజెక్ట్ చేద్దాం అనుకున్నాడు.

"క్యాండిడేట్స్‌ని పంపించు" ప్రభుకి చెప్పాడు.

ముగ్గురిని ఇంటర్వ్యూ చేసిన తర్వాత రాజశేఖర్ వచ్చాడు.

"సర్, బాగున్నారా?" వస్తూనే అడిగాడు నవ్వుతూ.

ఒకప్పుడు పేరు పెట్టి పిలిచేవాడు. ఇప్పుడు పిలుపు మారింది. జగదీష్ ముఖంలో గర్వం కనిపించింది.

"ఎలా ఉన్నావ్ రాజశేఖర్?" అన్నాడు దర్పంగా, ఏకవచనంతో.

"బాగున్నాను సర్."

"బాగానే పనిచేసేవాడివి కదా. నాకంటే ముందే ప్రమోషన్లు తెచ్చుకున్నావ్. ఇప్పటికి నాకంటే ఎంతో పెద్ద స్థాయిలో ఉంటావనుకున్నానే" వ్యంగ్యంగా అడిగాడు. జగదీష్ మాటల్లో వెటకారాన్ని అతను గమనించాడు.

"అమ్మా, నాన్నా, సొంతిల్లు... ఇవన్నీ ఉన్న ఈ ఊరిని వదిలి వెళ్ళలేకపోయాను సర్. పెద్దగా సంపాదించక్కర్లేదు. అందుకే ఇలా..." అంటూ నవ్వాడు.

"ఇది కూడా పెద్ద కంపెనీ కద సర్, అందులో మీరు తెలిసిన వ్యక్తి కాబట్టి నాకు ఇంకా బాగుంటుంది."

"ఓకే, నువ్వు వెళ్ళొచ్చు."

రాజశేఖర్ మంచి ఉద్యోగి. మార్కెట్ మీద పట్టు ఉంది. కానీ ఒకప్పుడు తనను వెనక్కి నెట్టిన వాడికి ఉద్యోగం ఇవ్వకూడదు. ఇదే జగదీష్ ఉద్దేశం.

రాత్రి పన్నెండయింది. అయినా అతనికి నిద్రపట్టడం లేదు. మంచం మీద అటూ ఇటూ దొర్లుతున్నాడు.

"సుమా! మాత్ర ఇవ్వు."

"నిద్ర మాత్ర రోజూ వాడటం మంచిది కాదండీ."

"గంట నుంచీ ట్రయ్ చేస్తున్నాను. నిద్ర పట్టడం లేదు. రేపంతా పని మీద ఆ ప్రభావం ఉంటుంది, ప్లీజ్" అన్నాడు.

'మనసును ప్రశాంతంగా ఉంచుకుని, మితిమీరిన ఆలోచనలు మానేస్తే నిద్ర హాయిగా పట్టేస్తుంది' అనబోయింది.

కానీ అతన్ని మార్చడం సులువు కాదని తెలుసు. ఓ మాత్ర అతని చేతిలో పెట్టి, నీళ్ళ గ్లాసు అందించింది.

★ ★ ★

"ఏమండీ లేవండీ" అంటున్న సుమ పిలుపుతో తెలివొచ్చింది.

"మీ చిన్నాన్నగారు చనిపోయారట. కీర్తి ఫోన్ చేసింది."

"ఈ మాత్రం దానికి నన్ను లేపాలా? ఆ కుటుంబం గురించి నేనెప్పుడో మరిచిపోయాను. మధ్యలో నీ హడావుడి ఏంటీ?" అన్నాడు చిరాగ్గా.

"ఆయన మీ సొంత చిన్నాన్న. మరిచిపోతే పోయే బంధం కాదిది, బయల్దేరండి" సుమ గట్టిగా చెప్పడంతో జగదీష్ అయిష్టంగానే బయల్దేరాడు.

అదో చిన్న స్లమ్ ఏరియా. కారు వెళ్ళడం కూడా కష్టంగా ఉంది. ఓ అరగంట వెతికితే ఇల్లు దొరికింది.

ఒక్క గది మాత్రమే ఉన్న రేకుల ఇల్లు అది. ఇంటి ముందు చిన్నాన్న శవం ఉంది. సుమని చూడగానే కీర్తి ఏడుస్తూ పరుగున వచ్చి గట్టిగా హత్తుకుంది. పిన్ని కళ్ళల్లో నీళ్ళు కూడా ఇంకిపోయినట్లున్నాయి. శవం పక్కన కూర్చుని నిస్తేజంగా చూస్తోంది. ఆ బస్తీ వాళ్ళు కాబోలు ఓ నలుగురు చుట్టూ ఉన్నారు.

"నిన్న రాత్రి ఆస్పత్రిలో చనిపోయారట. అంత్యక్రియలకు కూడా డబ్బులు లేవు. చుట్టుపక్కల వాళ్ళు చందాలు వేసుకుంటున్నారట. ఇంట్లో నాలుగు తిండి గింజలు కూడా లేవు" కాసేపయ్యాక భర్తతో చెప్పింది సుమ.

జగదీష్ మౌనంగా వింటున్నాడు. అతని

(c) eenadu

ముఖంలో ఎలాంటి భావాలూ లేవు.

"కీర్తి ఇంటర్ ఫస్టియర్లో 98 శాతం మార్కులతో పాస్ అయింది. డబ్బులు లేక చదువు ఆపేసింది. ఉద్యోగం వెతుక్కుంటోంది. ఈలోగా ఇలా..." అంటూ ఆపేసింది సుమ.

తన తండ్రి చనిపోయినప్పుడు తనది దాదాపు ఇదే పరిస్థితి. కాకపోతే అది తమ సొంతూరు కావడంతో తలో చేయి వేసి కార్యక్రమం గట్టెక్కించారు. అతనికి అక్కడ ఎక్కువసేపు ఉండాలనిపించలేదు.

"సుమా, ఇంటికి వెళ్దాం పద" ఆమె దగ్గరకు వచ్చి లోగొంతుతో చెప్పాడు.

"ఈ పరిస్థితుల్లో... వీళ్ళను ఇలా వదిలేశా!?" ఆశ్చర్యం, బాధా కూడిన గొంతుతో అడిగింది.

"అవును, పద."

భార్య ముఖంలో సంశయం చూసి "వస్తావా... రావా?" అని గట్టిగా అడిగాడు. అక్కడున్న వాళ్ళంతా తమనే చూస్తుండటంతో సుమ బయల్దేరక తప్పలేదు. ఆఫీసుకు వెళ్ళాడు, కానీ పని మీద దృష్టి పెట్టలేకపోతున్నాడు.

చిన్నాన్న శవం... దిక్కుతోచని స్థితిలో ఉన్న పిన్నీ, కీర్తి... ఈ దృశ్యాలు అతని కళ్ళముందు తారాడుతున్నాయి.

నిస్సహాయ స్థితిలో ఈ నగరంలో ఓ ఇద్దరు ఆడవాళ్ళు బతకాలి. తెలివైన అమ్మాయి అర్ధంతరంగా చదువుని ఆపేయాలి. ఓ చిన్న ఉద్యోగంలో చేరాలి. ఏ మగాడి కళ్ళల్లో అయినా పడితే... అసలే పరిస్థితులు బాగాలేవు. ఈ ఆలోచనలు జగదీష్‌ని స్థిమితంగా ఉండనీయడం లేదు. కానీ చిన్నాన్న తన కుటుంబానికి చేసిన ద్రోహం..?

'ఏరా తమ్ముడూ, ఒంట్లో బాగాలేదట. నాకు సెప్పలేదేంరా. నేను సచ్చిపోనానుకున్నావా?' ఆఫీసులో కాంతమ్మ అరుపులు వినిపిస్తున్నాయి. 'ఏ ఆస్పత్రి... నేను వస్తున్నాను.'

రెండు నిమిషాల తర్వాత ఆమె జగదీష్ కళ్ళముందు ప్రత్యక్షమైంది.

"తమ్ముడికి బాలేదు బాబూ. ఆస్పత్రికి వెళ్ళాలి. ఓ రెండువేల రూపాయలు కావాలి" నసుగుతూ అడిగింది.

"అతను నిన్ను మెడ పట్టుకుని గెంటేశాడని నిన్న అరిచావ్. ఏ ముఖం పెట్టుకుని వెళ్తావ్" చిరాగ్గా అడిగాడు.

"అదేటి బాబూ, అలాగంటవేటి. గొడవలయ్యాయని బందుత్వాలు సంపేసికుంటమా? ఆడు నా తోబుట్టు. ఆడు పోతే ఇక ఎవుర్ని తమ్ముడని పిలుత్తాను? మనుసుల మద్య లచ్చా తొంబయ్ గొడవలుంటయ్. ఆటినే పట్టుకుని ఏలాడతామా? అందరితో కయ్యం పెట్టేసుకుని, ముఖం మాడుసుకుని బతకడానికి మనిసిగా పుట్టడమెందుకు? ఈ తగూలన్నీ మనసులో ఎట్టుకుంటే రాతిరి నాకు నిద్దర పట్టదు. కోపమొస్తే గట్టిగా తిట్టేస్తాను. అక్కడితో ఆ కథ అయిపోయినట్లే. అయినోళ్ళకి కష్టమొచ్చినప్పుడు మనం పక్కనుండకపోతే ఎట్టా బాబూ..?"

ఈ మాటలు జగదీష్‌కు గట్టిగా తగిలాయి.

చాలాకాలం నుంచీ తన బుర్రను తొలిచేస్తున్న ప్రశ్నలన్నింటికీ కాంతమ్మ సమాధానం చెప్పినట్లయింది.

"ప్రభుని అడిగి డబ్బులు తీసుకో" అంటూ సీట్లోంచి లేచి, కారు వైపు పరుగు తీశాడు.

సుమకి ఫోన్ చేసి 'చిన్నాన్న ఇంటికి వెళ్లాలి, రెడీగా ఉండ'మని చెప్పాడు. ఇద్దరూ అక్కడకి చేరేసరికి ఓ పది మంది వరకూ బస్తీవాసులు ఉన్నారు. తమను వదిలేసి వెళ్ళిన మనుషులు మళ్ళీ ప్రత్యక్షం కావడంతో తల్లీ కూతుళ్ళిద్దరూ ఆశ్చర్యపోయారు.

"అమ్మా, ఈ వెయ్యి రూపాయలు పోగయ్యాయి" అంటూ ఓ వ్యక్తి శాంత చేతిలో డబ్బులు పెట్టాడు.

"వెయ్యి రూపాయలకు శవాన్ని ఎలా లేపగలం. బస్తీ వాళ్ళంతా అడుక్కు తింటున్నారా... మీరు మనుషులు కాదా?" అంటూ ఓ పెద్దామె అరుస్తోంది.



"ఒరే శంకరూ, ఈ చెవి దుద్దులు తాకట్టు పెట్టి డబ్బులు తీసుకురా. తల్లీ కూతుళ్ళు అనాథలుగా మిగిలిపోయారు, పాపం" అంటూ ఆవిడ దుద్దులు ఓ వ్యక్తి చేతుల్లో పెట్టింది.

"అమ్మా, ఇద్దరూ ఆడవాళ్ళే ఉన్నారు. తల కొరివి పెట్టేవాళ్ళు ఎవరైనా ఉన్నారా? లేదంటే ఆ ఏర్పాట్లు కూడా చేయాలా?"

ఆ మాటకు శాంత భోరున ఏడవడం మొదలుపెట్టింది. తల్లి ఆవేదనతో కీర్తి కూడా వెక్కివెక్కి ఏడుస్తోంది.

జగదీష్ వైపు చూసింది సుమ. అతని కంటినిండా నీళ్ళు. కర్కశంగా కనిపించే తన భర్త కరిగి కన్నీరవుతున్నాడు.

"ఏమండీ..." అన్న సుమ పిలుపుతో ఆమె వైపు చూశాడు.

"తలకొరివి..?" అంటూ సందేహంగా ఆగింది.

"నేనే పెడతాను" అన్నాడు అప్పుడే కలలోంచి బయటకు వచ్చినట్లుగా.

"అమ్మా, మీ దుద్దులు మీరు తీసుకోండి. ఆ వెయ్యి రూపాయలు కూడా ఎవరివి వాళ్ళకి ఇచ్చేయండి. అంత్యక్రియల విషయం నేను చూసుకుంటాను" అన్నాడు.

"ఇతను..?" అంటూ ఆ పెద్దామె ఆగింది.

"మా బావగారి అబ్బాయి" అంటున్న పిన్ని కళ్ళల్లో ఓ పెద్ద ఓదార్పు.

"కొడుకే అన్నమాట, మరింకేం" అంటూ దుద్దులు తీసుకుందామె.

★ ★ ★

"బాబూ, నువ్వు లేకపోతే మీ చిన్నాన్న శవం అనాథ ప్రేతంలా వెళ్ళేది" రెండు చేతులూ ఎత్తి దండం పెడుతూ అంది పిన్ని, అంత్యక్రియల తర్వాత.

"డబ్బు మైకంలో ఆయన మిమ్మల్నే కాదు. మా వాళ్ళని కూడా దూరం చేసుకున్నారు. ఇలా మమ్మల్ని అనాథలుగా వదిలేశారు. సంపాదించిన నాలుగు డబ్బులూ కూడా నిలుపుకోలేకపోయారు. చెడు అలవాట్లకు బానిసై మా ఇద్దర్నీ రోడ్డున పడేశారు" చీర చెంగుతో కన్నీళ్ళు తుడుచుకుంటూ చెప్పిందామె.

"ఇది నా బాధ్యత పిన్నీ. మీరిద్దరూ వెంటనే మనింటికి బయల్దేరండి. కీర్తీ, నువ్వు కావలసినంత చదువుకో. నీకు నేనున్నాను" జగదీష్ మనస్ఫూర్తిగా అన్నాడు.

"వద్దులే బాబూ. నువ్వు ఎన్ని ఇబ్బందులు పడ్డావో నేను ఊహించగలను. నీకు భారం కావడం మాకిష్టం లేదు."

"కష్టపడిన వాళ్ళకే కష్టం విలువ తెలుస్తుంది. అయినవాళ్ళని- అందులోనూ ఆడవాళ్ళని- ఇలా ఒంటరిగా వదిలి వెళ్ళలేం. మీరు వెంటనే బయల్దేరండి. కీర్తీ బ్యాగ్ సర్దుకో" సుమ ఆర్డర్ వేసింది.

★ ★ ★

"మీరు సెలెక్ట్ చేసిన ఇద్దరికీ మెయిల్ పెడుతున్నాను సర్. ఒకటో తేదీనాడు జాయిన్ కావాలని రాశాను" అన్నాడు కంప్యూటర్ ముందు కూర్చున్న ప్రభు.

"ఆ లిస్టులో రాజశేఖర్ పేరు కూడా కలుపు."

"అలాగే సర్."

జగదీష్ పెదాలపై నవ్వు విరిసింది.

చిన్నాన్న మరణం, కాంతమ్మ దృక్పథం జగదీష్ ఆలోచనల్లో గణనీయమైన మార్పు తీసుకువచ్చాయి. పరిస్థితులకు అనుగుణంగా మనుషులు ప్రవర్తిస్తారనే జీవిత సత్యం తెలిసొచ్చింది. అందరిమీదా కోపాలు పెంచుకుని, తన ఆనందాన్ని కోల్పోతున్నానని అర్థమైంది. అతని ప్రవర్తనలో సౌమ్యతా, ముఖంలో నవ్వూ తొంగిచూడటం మొదలైంది.

"మీకు ఇక నిద్రమాత్రలు అవసరం లేదేమో" పిల్స్ డబ్బాను డస్ట్‌బిన్‌లో పడేస్తూ అంది సుమ.

గత కొన్ని రోజులుగా నిద్రమాత్రలు లేకుండానే గాఢంగా నిద్ర పడుతున్న విషయం అప్పుడు గుర్తొచ్చింది అతనికి.

"అవును. ఇక అవసరం ఉండకపోవచ్చు" అన్నాడు నవ్వుతూ. ★

(c) eenadu

కలిసి వండుకోవడం... కలిసి తినడానికి మించిన పండగేముంటుంది. అందరూ కలిసే ఈ దసరా వేడుక వేళ... ఇంటి వాతావరణాన్ని మరింత ఆనంద దాయకం చేసుకోవాలంటే ఇంట్లోనే ఈ మిఠాయిలు చేసి చూడండి. అందరూ తలో చెయ్యి వేసి సాయం చేస్తారు, మిఠాయిని మించిన తీయదనాన్ని పంచుకుంటారు...

నోటిని తీపి చేసుకుందాం!



ఇన్‌స్టంట్ జిలేబి

కావలసినవి: మైదా: 200గ్రా, ఉడికించిన బంగాళాదుంపలు: రెండు, చిక్కని పెరుగు: అరకప్పు, ఈనో లేదా ఫ్రూట్‌సాల్ట్: పావుచెంచా, నూనె: వేయించడానికి సరిపడా, కుంకుమపువ్వు: చిటికెడు, యాలకులపొడి: పావుచెంచా, బెల్లం తురుము: మూడు కప్పులు, నీళ్లు: ఒకటిన్నర కప్పు.

తయారీ విధానం: ఒక పాత్రలో నీళ్లుపోసి అందులో బెల్లం తురుము, యాలకులపొడి, కుంకుమపువ్వు వేసి పదినిమిషాలు మరగనిచ్చి పాకం చేసుకోవాలి. ఈలోపు ఒక గిన్నెలో మైదా, ఉడికించి మెత్తగా మెదిపిన బంగాళాదుంప ముద్ద, పెరుగు, ఫ్రూట్‌సాల్ట్ తీసుకుని బాగా కలుపుకోవాలి. ఆలూ ముక్కలు చేతికి తగులుతూ ఉంటే ఈ మొత్తం మిశ్రమాన్ని ఒకసారి మిక్సీ పట్టుకున్నా మంచిదే. స్టవ్ వెలిగించి నూనె పోసుకుని వేడెక్కాక... జిలేబీ పిండిని ఒక కోన్‌లోకి కానీ, బట్టలోకి కానీ తీసుకుని జిలేబీల్లా వేసుకోవాలి. వీటిని కాస్త వేడిగా ఉండగానే బెల్లం పాకంలో వేసుకుంటే కరకరలాడే ఆలూ జిలేబీలు సిద్ధం.

రోజ్ కోకోనట్ బర్ఫీ

కావలసినవి: తాజా కొబ్బరికోరు: రెండు కప్పులు, నెయ్యి: మూడు చెంచాలు, కండెన్స్‌డ్‌మిల్క్: అరకప్పు, చక్కెర: మూడు టేబుల్‌స్పూన్లు, రోజ్‌సిరప్: మూడు చెంచాలు, పాలు: పావుకప్పు, పింక్ ఫుడ్‌కలర్: మూడు చుక్కలు, సిల్వర్ వరక్ పేపర్స్: రెండు(అలంకరణకోసం), సన్నగా తరిగిన పిస్తా, బాదం పలుకులు: మూడు చెంచాలు



తయారీ విధానం: నాన్‌స్టిక్ పాన్‌లో రెండు చెంచాల నెయ్యి వేసుకుని కొబ్బరికోరుని పచ్చివాసన పోయేంతవరకూ వేయించుకోవాలి. ఇప్పుడు పాలు పోసి ఒక నిమిషం పాటు వేయించుకోవాలి. కండెన్స్‌డ్ మిల్క్, రోజ్‌సిరప్, ఫుడ్‌కలర్ కూడా వేసుకుని అన్నీ సమంగా కలిసేటట్టు గరిటెతో కలుపుకోవాలి. నీరంతా పోయి దగ్గరగా అవుతున్నప్పుడు స్టవ్ కట్టేయాలి. వెడల్పాటి పళ్లెం తీసుకుని అందులో మిగిలిన నెయ్యి రాసుకుని కొబ్బరి మిశ్రమాన్ని అంతటా సమంగా పరుచుకోవాలి. ఇదికాస్త వేడిగా ఉండగానే సిల్వర్‌వరక్ కాగితాన్ని పరుచుకుని దానిపైన బాదం, పిస్తా పలుకుల్ని చల్లుకోవాలి. చాకుతో ముక్కలుగా కోసుకుంటే రోజ్ కోకోనట్ బర్ఫీ సిద్ధం.


రవ్వ కాకరాలు



కావలసినవి: తాజా కొబ్బరికోరు: అరకప్పు, యాలకులపొడి: అరచెంచా, బెల్లం తురుము: పావుకప్పు, నూనె: వేయించడానికి సరిపడా, బొంబాయి రవ్వ: అరకప్పు, పంచదార: మూడు చెంచాలు, నెయ్యి: చెంచా, ఉప్పు: చిటికెడు

తయారీ విధానం: స్టవ్‌పైన గిన్నెపెట్టి కప్పు నీళ్లను మరిగించుకోవాలి. ఇందులో ఉప్పు, పంచదార, నెయ్యి వేసుకుని నీళ్లు మరుగుతున్నప్పుడు రవ్వని ఒకేసారి కాకుండా కొద్దికొద్దిగా పోసుకుంటూ ఉండకట్టకుండా గరిటెతో తిప్పుకోవాలి. రవ్వ ఉడికాక స్టవ్ కట్టేయాలి. ఈలోపు మరో కడాయిలో బెల్లం తురుములో కాసిని నీళ్లు పోసుకుంటే బెల్లం కరిగిపోతుంది. అందులో కొబ్బరికోరు, యాలకులపొడి వేసి పదినిమిషాలపాటు ఉడకనిచ్చి స్టవ్ కట్టేయాలి. చల్లారాక ఈ కొబ్బరి మిశ్రమాన్ని చిన్నచిన్న ఉండలుగా చేసుకోవాలి. అలాగే ఉడికించిన గోధుమరవ్వ మిశ్రమాన్ని కూడా ఉండలుగా చేసి, వెడల్పుగా పూరీల్లా చేత్తోనే ఒత్తుకుని అందులో కొబ్బరి ఉండలని ఉంచి చుట్టూమూసేయాలి. గుండ్రంగా కాకుండా కాస్త చేత్తో ఒత్తితే చూడ్డానికి కచోరీల్లా వస్తాయి. వీటిని నూనెలో దోరగా వేయించుకుంటే రుచికరమైన రవ్వ కాకరాలు సిద్ధం.

అంగూరీ రస్‌మలై



కావలసినవి: బ్రెడ్‌స్లైసులు: రెండు, పనీర్ తురుము: అరకప్పు, పాలపొడి: అరకప్పుపైన మరో రెండు చెంచాలు, పంచదార పొడి: ఎనిమిది చెంచాలు, కాచి చల్లార్చిన పాలు: అరకప్పు, పసుపు రంగు ఫుడ్‌కలర్: చిటికెడు, పాలమీగడ లేదా క్రీం: రెండు చెంచాలు, సన్నగా తరిగిన బాదం, పిస్తా, జీడిపప్పు పలుకులు: రెండు చెంచాలు

తయారీ విధానం: బ్రెడ్ స్లైసుల అంచులని చాకుతో తీసేసి, వాటిని మిక్సీలో మెత్తగా గ్రైండ్ చేసి పెట్టుకోవాలి. ఈ బ్రెడ్‌పొడిలో పనీర్ తురుము, రెండు చెంచాల పాలపొడి, నాలుగు చెంచాల పంచదార పొడి వేసి అన్నింటినీ బాగా కలిపి చపాతీ పిండిలా చేసుకోవాలి. ఈ పిండిని చిన్నచిన్న ఉండలుగా చేసుకుని పక్కన పెట్టుకోవాలి. మరొక గిన్నె తీసుకుని పాలు, మిగిలిన పాలపొడి, పంచదార పొడి వేసి, ఫుడ్ కలర్‌వేసి ఉండలు కట్టకుండా అన్నింటినీ బాగా కలుపుకోవాలి. చివరిగా క్రీం కూడా వేసుకుని మరోసారి కలిపిన తర్వాత ఈ మిశ్రమాన్ని, తయారుచేసి పెట్టుకున్న పనీర్ ఉండలపైన పోసి, డ్రైఫ్రూట్స్ పలుకులతో అలంకరించుకుంటే సరి.

(c) eenadu

సిసింద్రీ


తప్పులే తప్పులు

పిల్లలు పిక్నిక్‌కి వెళ్లి లంచ్ చేస్తున్న చిత్రమిది. అయితే, బొమ్మలో ఉన్న అయిదు తప్పులను కనిపెట్టండి చూద్దాం.




దారి కనుక్కోండి

హోంవర్క్ చేసుకుందామని స్నేహితుడి ఇంటికి బయలుదేరాడు రవి. అయితే, దారి తెలియక తికమక పడుతున్నాడు. తనకు మీరేమైనా సాయం చేయగలరా?



చెప్పగలరా?

స్నేహితులంతా కలిసి ఓ బేకరీకి వెళ్లి, పిజ్జా ఆర్డర్ ఇచ్చుకున్నారు. పిజ్జా పైనున్న టాపింగ్స్ ఆధారంగా- అందులో ఎవరు, ఎక్కడున్న ముక్కను తీసుకున్నారో చెప్పగలరా?



తెలుసా... తెలుసా...



ఇక్కడున్న బొమ్మల్లోని ఆంగ్ల పదాల మొదటి అక్షరాల్లో ఓ దేశం పేరు దాగుంది. అదేంటో చెప్పగలరా?

నిజమే మరి!

బంటీ: చంటీ... మనం నిజంగా అదృష్టవంతులమే...

చంటీ: ఎందుకలా అంటున్నావు?

బంటీ: మనం సరైన టైమ్‌లో పుట్టాం కాబట్టి... ఒకవేళ ముందు పుట్టి ఉంటే... ఇప్పటికే పెద్దోళ్లమై పోయేవాళ్లం... ఆలస్యమైతే ఇప్పటికింకా మాటలు కూడా వచ్చేవి కావు...

చంటీ: ఆఁ...!

తేడాలేంటి?

ఈ కింది బొమ్మల మధ్య ఎనిమిది తేడాలున్నాయి. అవేంటో కనిపెట్టగలరా?





(c) eenadu

కనుక్కోండి చూద్దాం

చెట్ల నుంచి రాలుతున్న ఆకుల్ని పట్టుకుంటూ ఆడుకుంటున్నాడు హరి. వాటిల్లో తనకొకటి బాగా నచ్చింది. అది ఏదో కనుక్కోండి చూద్దాం.

★ అయిదు కొనలు ఉన్నాయి. ★ దానిపైన రెండు రంధ్రాలున్నాయి.
★ ఆరెంజ్ రంగులో ఉంటుంది. ★ కాడ ఉంటుంది.



అది ఏది?

ఇక్కడ గజిబిజిగా ఉన్న సంఖ్యల్లో... ఒక్కటి మాత్రమే రెండుసార్లు ఉంది. మరి ఆ ఒక్కటీ ఏదో చెప్పండి చూద్దాం.



గెలిచినట్లా.. ఓడినట్లా?

ఒక ఊరిలో ఇద్దరు కుర్రాళ్లుండేవారు. వాళ్లు సోమరిపోతులు. ఒకరోజు ఆ ఊళ్లోని సత్రానికి వేరే ప్రాంతం నుంచి ఓ వ్యక్తి వచ్చాడు. అతడిని ఆట పట్టించాలనుకొని మాట కలిపారు. 'మనం ఒక పందెం వేసుకుందాం. ఒక్కొక్కరూ తమకు కలిగిన ఓ వింత అనుభవాన్ని చెప్పాలి. వినేవాళ్లలో ఎవరైనా దాన్ని నమ్మకపోతే, అది చెప్పిన వారికి లొంగిపోవాలి' అన్నారు. దానికా పొరుగూరి వ్యక్తి ఒప్పుకున్నాడు.



మొదటి కుర్రాడు.. 'నేను కడుపులో ఉన్నప్పుడు మా అమ్మకు నేరేడు పండ్లు తినాలనిపించింది. ఎవరిని అడిగినా చెట్టు ఎక్కడం రాదన్నారు. అప్పుడు నేనే బయటికొచ్చి, గబగబా చెట్టెక్కి.. పండ్లన్నీ కోసి అమ్మ చేతిలో పెట్టా' అన్నాడు. అందరూ తాము అది నమ్మినట్లు తల ఆడించారు. రెండో కుర్రాడు.. 'నేను వారం రోజుల పసివాడిగా ఉన్నప్పుడు.. అడవికి వెళ్లాను. అక్కడి చింతచెట్టెక్కి కడుపునిండా కాయలు తిన్నాను. దాంతో దిగడం అసాధ్యమైంది. అందుకని ఊళ్లోకి వెళ్లి ఒక నిచ్చెన పట్టుకొచ్చా. దాన్ని ఆ చెట్టుకు వేసి, కిందకు దిగి ఇంటికెళ్లిపోయా. నిచ్చెన దొరక్కపోతే, ఆ చెట్టు మీదే ఉండిపోవాల్సి వచ్చేది' అని తన కథ చెప్పాడు. నమ్మినట్లు తల ఆడించారందరూ. ఇక పొరుగూరి వ్యక్తి వంతు వచ్చింది. 'గతేడాది నా చేనులోని ఓ పత్తి మొక్కకు రెండే కొమ్మలొచ్చాయి. ఒక్కో కొమ్మకు ఒక్కో కాయ కాసింది. వాటిల్లోంచి ఇద్దరు కుర్రాళ్లు బయటకు వచ్చారు. వాళ్లు నా పొలంలో పండిన కాయల్లోంచి వచ్చిన వారే కాబట్టి.. నేను చెప్పిన పని చేయాల్సి ఉంటుంది. కానీ, వాళ్లు సోమరిపోతులు కావడంతో పారిపోయారు. వాళ్లను వెతుక్కుంటూ బయలుదేరిన నాకు- ఇక్కడ కనిపించారు. మీరే ఆ ఇద్దరూ.. నా వెంట వచ్చేయండి' అంటూ ముగించాడు. 'కథ నిజమంటే పొలానికెళ్లి పనిచేయాలి.. నమ్మలేదంటే పందెం ప్రకారం లొంగిపోవాలి. ఎలా చూసినా మనం ఇరుక్కుపోయాం' అనుకున్నారా ఇద్దరు. 'ఇక ఎవరినీ ఆటపట్టించకుండా బుద్ధిగా పనిచేసుకుంటాం' అంటూ క్షమాపణ అడిగారు. 'అలా రండి దారికి...' అంటూ వెళ్లిపోయాడతను.

రంగులేద్దాం



జవాబులు


తేడాలేంటి?: 1. బంతి వెనుకనున్న కాగితపు పడవ 2. చెట్టున్న చోటు 3. టెడ్డీబేర్ 4. కూర్చున్న బాబు చొక్కా చేతులు 5. పిల్లి దిశ 6. గొడుగు పైనున్న రంగులు 7. ఇటుకల వరస 8. పాప గౌను మీద డిజైన్

తప్పులే తప్పులు: 1. వాటర్ క్యాన్ మూత దగ్గర ట్యాప్ 2. కుందేలుకు చెవులు లేవు 3. రెండు రంగుల్లో బాబు ప్యాంట్ 4. గోడ పైన మబ్బు 5. గాల్లో కూర్చున్న పాప.

తెలుసా... తెలుసా..: MALDIVES (Moon, Apple, Lemon, Dove, Ink, Violin, Eight, Snail).

అది ఏది?: 29


చెప్పగలరా?: 1-డి, 2-బి, 3-సి, 4-ఎ.



(c) eenadu

అక్షర దృశ్యాలు!

'మౌన సాక్ష్యాలు' పుస్తకం కేశవులు అంతరంగ ఆవిష్కరణ. ఆయన కెమెరాకు వేయి కళ్లు. ప్రతి ఛాయాచిత్రంలోనూ




గుండెల్ని కరిగించే దృశ్యంతోపాటు వ్యవస్థను కదిలించే వార్తా ఉంటుంది. అది బేగంపేట విమానాశ్రయంలో 'అణా కూలీ' అంజయ్యకు జరిగిన తీవ్ర అవమానం కావచ్చు, తెలుగుజాతి ఆత్మగౌరవ పతాక ఎన్టీఆర్ చైతన్య రథయాత్రా కావచ్చు. పాతబస్తీ మత కల్లోలాలు, లాతూర్ భూకంపం, బషీర్‌బాగ్ పోలీసు కాల్పులు, భోపాల్ గ్యాస్ దుర్ఘటన, తెలుగుదేశం పార్టీలో ఆగస్టు సంక్షోభం... ఇలాంటి అనేకానేక సంఘటనలకు కేశవులు కెమెరా ప్రత్యక్ష సాక్షి. పేదల బతుకులూ, మధ్యతరగతి కష్టాలూ, భాగ్యనగర సౌందర్యాలూ... ఆయన లెన్సుకు ఇష్టమైన కోణాలు. ఓ అధ్యాయంలో రాష్ట్ర విభజనతో మొదలుపెట్టి వివిధ అంశాలపైనా సూటిగా స్పందించారు. 'ఈనాడు' ఫొటోగ్రాఫర్‌గా కీలక రాజకీయ పరిణామాలను అతిదగ్గర నుంచి చూసిన అనుభవాలను కూడా సత్యవోలు సుందరసాయి అక్షరాల సాక్షిగా అందరితో పంచుకున్నారు కేశవులు.

మౌన సాక్ష్యాలు (కేశవులు న్యూస్ ఫొటోలు)
రచన: డా. సత్యవోలు సుందరసాయి
పేజీలు: 208; వెల: రూ.500
ప్రతులకు: ఫోన్: 9299152060

సమీక్ష

కష్టసుఖాలు

ఈ సంకలనంలోని కథలు అచ్చమైన మధ్యతరగతి జీవితాలు. 'అవివేకం'లో పొద్దస్తమానం సోషల్ మీడియాతో కాలక్షేపం చేసే ఓ నాన్న తన కూతురి గురించి




తరచూ పెట్టే పోస్టుల్ని చదివి... ఓ యువకుడు ఆమె పట్ల ఆకర్షణను పెంచుకుంటాడు. ఆ యువతి ఫొటోను మార్ఫింగ్ చేసే వరకూ వెళ్తుంది వ్యవహారం. లైకుల పిచ్చి ముదిరితే ఏం జరుగుతుందో ఈ కథలో వివరించారు. 'అపోహలు' కథ తోబుట్టువుల మధ్య ఏర్పడిన అగాధాన్ని పూడుస్తుంది. 'అందని ద్రాక్ష అపురూపం'... ఉచిత సలహాలిచ్చేవారికి మెత్తని చురక.

అరవింద (మరికొన్ని కథలు)
రచన: జ్యోతి మువ్వల
పేజీలు:133, వెల: రూ.140
ప్రతులకు: ఫోన్: 9008083344

జీవనరేఖలు

నూట అరవై పైచిలుకు జీవితాల రేఖామాత్ర పరిచయం ఈ పుస్తకం. ప్రతి వ్యాసమూ ఓ 'షార్ట్‌ఫిల్మ్'లా ఆయా దిగ్గజాల ప్రయాణాన్ని కళ్లకుకడుతుంది.




'అన్నీ తెలుసు అన్నవాడు అల్పజ్ఞుడు, మనసు తెలుసుకున్నవాడు మర్మజ్ఞుడు, తనని తాను తెలుసుకున్నవాడు తత్వజ్ఞుడు' అనే స్ఫూర్తిదాయక వాక్యంతో మొదలైన 'అక్కినేని మరో కోణం...'తో ఆరంభించి మహానటులూ, దర్శకులూ, గొప్ప నిర్మాతలూ, సంగీత స్వరనిధులూ, బహుముఖ ప్రజ్ఞావంతులూ... ఇలా ఎందరో ప్రతిభామూర్తుల ప్రస్థానాన్ని క్లుప్తంగా అందించారు ఎస్వీ రామారావు.

మూవీ మాస్టర్స్, రచన: ఎస్వీ రామారావు
పేజీలు:250, వెల: రూ.200
ప్రతులకు: ఫోన్: 9000413413

ధిక్కార స్వరం

ఇరవై రెండేళ్ల ఉడుకు రక్తం. పెత్తందార్ల దౌర్జన్యాల్ని సహించలేని పౌరుషం. ఆ ఊరి దొర తన ఇల్లాలితో వెకిలిగా ప్రవర్తించడంతో ఆగ్రహంతో ఊగిపోయాడు. ఆవేశంలో ఆ కామాంధుడి ప్రాణాలు తీశాడు. స్వచ్ఛందంగా పోలీసులకు లొంగిపోయాడు. కోర్టులో ఉరిశిక్ష ఖరారైంది. తర్వాత అది యావజ్జీవ కారాగార శిక్షగా మారింది. ప్రపంచానికి దూరంగా బతికితేనేం, ఆ జైలు గోడల మధ్యే ప్రపంచాన్ని చదివాడు. వివిధ భావజాలాలను అర్థం చేసుకున్నాడు. విశ్వవిద్యాలయ పట్టాలు సాధించాడు. మృత్యువు



జానెడు దూరంలో ఉన్నప్పుడు కూడా ఏమాత్రం కుంగిపోలేదు. రాజన్నలోని ఆ గుండె ధైర్యమంతా 'ఉరికంబం నీడలో....' పుస్తకంలో అక్షరాలుగా ప్రవహిస్తుంది. ఆ బహుజనుడి ఆత్మకథను ఆర్ద్రతతో వినిపిస్తుంది.

ఉరికంబం నీడలో (ఒక బహుజనుడి ఆత్మకథ)
రచన: కె.రాజన్న; తెలుగు అనువాదం: కారం శంకర్
పేజీలు:156; వెల: రూ.150
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు

బుక్‌షెల్ఫ్

ఫీల్‌గుడ్ కాక్‌టైల్ కథలు
రచన: పినిశెట్టి శ్రీనివాసరావు
పేజీలు: 159, వెల: రూ.150
ప్రతులకు: ఫోన్: 9963749657

గెర్నికా (కవిత్వం)
రచన: కరిపె రాజ్‌కుమార్
పేజీలు: 112, వెల: రూ.150
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు

దుఃఖం పండుతున్న నేల (కవిత్వం)
రచన: బంగార్రాజు కంఠ
పేజీలు: 111, వెల: రూ.120
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు

పిఠాపురం రోడ్డు
(డా. శిరీష కథలు)
రచన: వేదుల శ్రీరామశర్మ
పేజీలు: 148, వెల: రూ.240
ప్రతులకు: ఫోన్: 9866050220

వసంత లోగిలి (నవల)
రచన: బంటుపల్లి శ్రీదేవి
పేజీలు: 138, వెల: రూ.200
ప్రతులకు: ఫోన్: 8500373859

అడ్డుగోడలు (కథా సంకలనం)
రచన: ఏనుగు కిశోర్‌బాబు
పేజీలు: 156, వెల: రూ.200
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు

సమిధలు (సాంఘిక నాటకం)
రచన: శొంఠి జయప్రకాష్
పేజీలు: 98, వెల: రూ.120
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు

నికోలో మేకియవెలి రాజు (ది ప్రిన్స్‌కు అనువాదం)
పేజీలు: 80, వెల: రూ.100
ప్రతులకు: ఫోన్: 0866-2476966

మునికిష్టడి మాణిక్యం
రచన: ఆర్.సి.కృష్ణస్వామి రాజు
పేజీలు: 80, వెల: రూ.50
ప్రతులకు: ఫోన్: 9490746614

అడవి మనిషి
రచన: గోగినేని మణి
పేజీలు: 87, వెల: రూ.125
ప్రతులకు: ఫోన్: 9949241286

త్రివేణి (కవిత్వం)
రచన: వారాల ఆనంద్
పేజీలు: 124, వెల: రూ.150
ప్రతులకు: ఫోన్: 9440501281

(c) eenadu

రాశిఫలం

గ్రహబలం
(సెప్టెంబరు 28 - అక్టోబరు 4)

డా॥ శంకరమంచి రామకృష్ణ శాస్త్రి



మేషం
అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

మంచి జరుగుతుంది. ప్రయత్నాలు విజయవంతం అవుతాయి. సూర్యభగవానుడి శక్తి మిమ్మల్ని ముందుకు నడిపిస్తుంది. ఉద్యోగంలో ఉన్నత స్థితి గోచరిస్తోంది. సమాజం కోసం పనిచేస్తారు. ఏడో స్థానంలోని బుధుడు వ్యాపారాన్ని బలోపేతం చేస్తాడు. సమస్యల్ని సృజనాత్మకంగా పరిష్కరించుకుంటారు. ఇష్టదైవాన్ని ఆరాధించండి.

వృషభం
కృత్తిక 2,3,4 పాదాలు; రోహిణి, మృగశిర 1,2 పాదాలు

అదృష్టకాలం కొనసాగుతోంది. మనోబలంతో కర్తవ్యాన్ని నిర్వర్తించండి. ఆలోచనల్లో స్పష్టత పెరుగుతుంది. ముఖ్య లక్ష్యాల మీద గురిపెడతారు. ఉత్తమ ఫలితాలు సాధిస్తారు. ఒంటరి ప్రయత్నాలు చేయకండి. చెడు ఆలోచనల్ని దూరంగా ఉంచండి. భూలాభం ఉంది. శుభకార్యాలు నిర్వహిస్తారు. మహాలక్ష్మిని ధ్యానించండి.

మిథునం
మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

వ్యాపారంలో లాభాలు ఉన్నాయి. కొన్ని సవాళ్లు ఎదురైనా, బుద్ధిబలం అండగా నిలుస్తుంది. సహనంతో వ్యవహరించండి. వృత్తి, ఉద్యోగ, వ్యాపారాల్లోని సమస్యలు తొలగిపోతాయి. సరైన ప్రణాళికతోనే ఒత్తిడిని అధిగమించగలరు. వారం మధ్యలో ఓ ఆపద నుంచి బయటపడతారు. ఆర్థికంగా మరింత స్థిరత్వం సాధించే ప్రయత్నం చేస్తారు. సూర్యనారాయణుడిని ఉపాసించండి.

కర్కాటకం
పునర్వసు 4వ పాదం; పుష్యమి, ఆశ్లేష

అంతా మంచే జరుగుతుంది. మీ ప్రయత్నాన్ని బట్టి ఫలితాలు ఉంటాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆత్మవిశ్వాసాన్ని కోల్పోవద్దు. ముఖ్య లావాదేవీల విషయంలో లోతుగా ఆలోచించండి. వ్యక్తిగత వ్యవహారాల్లో గోప్యత అవసరం. ఆర్థికంగా ఉత్తమ ఫలితాలు సాధిస్తారు. వారాంతంలో ఓ శుభవార్త వింటారు. నవగ్రహ శ్లోకాలను పఠించండి.

సింహం
మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

లక్ష్మీ కటాక్షం ఉంది. దైవానుగ్రహం పుష్కలం. ప్రారంభించిన పనులు త్వరగా పూర్తవుతాయి. కాలాన్ని సద్వినియోగం చేసుకుంటారు. వృత్తి ఉద్యోగాల్లో ప్రగతిని సాధిస్తారు. వ్యాపారాన్ని విస్తరిస్తారు. వారాంతంలో ఓ శుభవార్త వింటారు. చిన్నపాటి ప్రయత్నాలే మేలైన ఫలితాలను అందిస్తాయి. ఇష్టదైవాన్ని పూజించండి.

కన్య
ఉత్తర 2, 3, 4 పాదాలు; హస్త, చిత్త 1, 2 పాదాలు

మనోబలంతో పనులను ఆరంభించండి. లక్ష్య సాధనలో వెనకడుగు వేయకండి. ఏ విషయంలోనూ చంచలత్వం వద్దు. కొత్త ప్రయోగాలకు సమయం కాదు. ఆర్థికంగా మిశ్రమ ఫలితాలు లభిస్తాయి. ఆదాయంతో పాటు ఖర్చులూ అధికంగానే ఉంటాయి. వృత్తి, ఉద్యోగ, వ్యాపారాల పట్ల అశ్రద్ధ వద్దు. నవగ్రహ శ్లోకాలను చదువుకోండి.

తుల
చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఏకాగ్రత అవసరం. దైవబలం రక్షిస్తుంది. అశ్రద్ధ కారణంగా కొన్ని సమస్యలు జటిలంగా మారే ప్రమాదం ఉంది. ఏకాదశంలో ఉన్న శుక్రయోగంతో ఆదాయ మార్గాలు విస్తరిస్తాయి. ఉద్యోగంలోని ఆటంకాలను తొలగించుకుంటారు. వినమ్రత అవసరం. కాలం మిశ్రమంగా ఉంది. సహనాన్ని పరీక్షించేవారితో జాగ్రత్త. సుబ్రహ్మణ్యేశ్వరుడిని స్మరించండి.

వృశ్చికం
విశాఖ 4వ పాదం; అనూరాధ, జ్యేష్ఠ

విజయం వరిస్తుంది. దీర్ఘకాలిక ప్రయత్నం సానుకూల ఫలితాలను అందిస్తుంది. ఉద్యోగంలో మేలు జరుగుతుంది. శుభవార్త వింటారు. జీవితంలో స్థిరత్వం లభిస్తుంది. సమస్యల నుంచి బయటపడతారు. శత్రువులు మిత్రులుగా మారతారు. వ్యాపారంలో ఉన్నతస్థితి గోచరిస్తోంది. ఓపిక, సహనం అవసరం. ఇష్టదైవాన్ని ఆరాధించండి.

ధనుస్సు
మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

శుభకాలం కొనసాగుతోంది. ఆశించిన ఫలితాలు అందుకుంటారు. సమాజంలో గౌరవం పెరుగుతుంది. కొత్త అవకాశాల్ని సద్వినియోగం చేసుకుంటారు. తోటివారి ప్రోత్సాహం లభిస్తుంది. సాహసోపేతమైన నిర్ణయాలు భవిష్యత్తుకు పునాదులు వేస్తాయి. భాగ్య శుక్రయోగం వల్ల మంచి జరుగుతుంది. మహాలక్ష్మిని ధ్యానించండి.

మకరం
ఉత్తరాషాఢ 2, 3, 4 పాదాలు; శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

మనోబలంతో కొత్త ప్రయత్నాలను ఆరంభించండి. తొందరపాటు చర్యలు వద్దు. కొందరివల్ల గందరగోళ పరిస్థితులు నెలకొంటాయి. వివాదాస్పద వ్యవహారాల్లో తలదూర్చకండి. నిర్ణయాల్లో కుటుంబాన్ని భాగం చేయండి. వ్యాపారంలో నష్టాలు ఉన్నా, శ్రద్ధతో వాటిని అధిగమిస్తారు. నవగ్రహ స్తోత్రాలను పఠించండి.

కుంభం
ధనిష్ఠ 3, 4 పాదాలు; శతభిషం, పూర్వాభాద్ర 1, 2, 3 పాదాలు

ముఖ్య కార్యక్రమాల్లో విజయం మీదే. ఏకాగ్రతతో ముందుకు సాగండి. ఎట్టి పరిస్థితుల్లోనూ పనుల్ని వాయిదా వేయకండి. చిన్నపాటి అవరోధాలు ఉన్నా, బుద్ధిబలంతో అధిగమిస్తారు. ఆత్మీయుల సహకారం అందుతుంది. వివాదాలకు ఆస్కారం ఇవ్వకండి. ఆత్మవిశ్వాసంతో ఆర్థిక సమస్యల నుంచి బయటపడతారు. పరమేశ్వరుడిని ధ్యానించండి.

మీనం
పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

కృషికి తగిన ఫలితం ఉంటుంది. పరిస్థితులు ఏమంత సానుకూలంగా లేవు కాబట్టి, స్పష్టమైన ఆలోచనతో పనిచేయాలి. దైవబలం కాపాడుతుంది. రుణ సమస్యలకు ఆస్కారం ఇవ్వకండి. కొన్ని విషయాల్లో ఆశాభంగం కలగవచ్చు. ఇబ్బందులకు గురిచేసే వారితో జాగ్రత్త. గత అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకోండి. నవగ్రహ శ్లోకాలను పఠించండి.

(c) eenadu

పదకేళి

కూర్పు: బాలు

అడ్డం

1. అదృష్టం (2)
2. 'పొరుగు'కు జంటపదం... పక్కన అని అర్థం (3)
5. పెన్నుతో దేనిమీద రాస్తారు? (3)
7. చెల్లెలు (3)
8. నిప్పు చేయడానికి ఉపయోగించే రాయి (4)
10. మన్మథుడు (4)
11. చంద్రబాబు నియోజకవర్గం? (2)
12. మిక్కిలి, ఎక్కువ (2)
13. సత్తువ, బలం (2)
14. సేవకులు, సిబ్బంది, పరివారం (4)
16. చివర సున్నా లేకపోయినా అనంతమే (3)
18. కెరటం (3)
19. క్షణకాలం; తలుపు గడి (3)
21. మాసం (2)
22. ఆవాసం, ఇల్లు (3)
24. నీరాజనం (3)
26. కవి రాసేది (3)
27. 'వాసంతం'లో అమ్మాయి పేరు (3)
29. అల్లరి, రణగొణ ధ్వని (2)
30. ఈ పండు చిలుకలకు ఇష్టమట (2)
31. సూర్యుడు అస్తమించే దిక్కు (4)
33. హడావుడి, ఆర్భాటం, అట్టహాసం (3)
35. తల తెగిన అనుమతి (3)
37. బావి (2)
38. పాదం; ప్రశ్నించు (3)
39. బురద (3)
41. అపజయం (4)
43. పుడమి, భూమి (3)
44. అన్న భార్య (3)
45. సంవత్సరం (2)
46. వర్ణాలు (3)

1		✿	2	3		✿	4	✿	5		6
	✿	7			✿	8		9		✿	
10				✿	11		✿		✿	12	
	✿		✿	13		✿	14		15		✿
✿	16		17	✿	18			✿	19		20
21		✿	22	23		✿	24	25		✿	
	✿	26			✿	27			✿	28	✿
✿	29		✿	✿	30		✿	31			
32	✿	33	34		✿	35	36		✿		✿
37		✿		✿	38			✿	39		40
	✿	41		42		✿	43			✿	
44			✿		✿	45		✿	46		

నిలువు

1. దుర్యోధనుడి భార్య (4)
2. సూర్యుడు (3)
3. రోగం, జబ్బు (2)
4. వంక, మిష; పోషించు (2)
5. వాయసం (2)
6. ఓ పసుపురంగు పూలమొక్క (3)
7. సందేహం, శంక (4)
8. వెల్లడించం, తెలియబరచం (2)
9. కృష్ణుడు (3)
11. కలువ; వలయం కాని వలయం (4)
12. చూడండి (3)
14. ఎగతాళి, హేళన (4)
15. ధరణి, జగం (3)
16. తరంగం (2)
17. తృప్తి; కోరిక; ఎక్కువ ఇష్టం (3)
20. సాధువు, యోగి (2)
21. ఆజ్యం (2)
23. తీగ (2)
25. వలరాజు, మరుడు (4)
26. స్వప్నంతో గొడవ (3)
27. బలి చక్రవర్తిని పాతాళానికి తొక్కేసినవాడు (4)
28. అజరుడు, దివిజుడు (4)
32. కన్నుల జంట (4)
34. కంగారు, ఆందోళన (3)
36. మహిళలు, స్త్రీలు (4)
38. శుభం, స్వస్తి (2)
39. పెదవి (3)
40. దేవతలు (3)
41. కట్ట, మోపు (2)
42. నీరు (2)

సుడొకు

8		9			3	7	2	
			7	2			6	8
	6				4			1
5		1			6		4	2
9	2		4			3		6
3			6				8	
6	9			7	5			
	8	2	3			6		5

గతవారం సమాధానాలు

పదకేళి

1 నా	రి	2 కే	ళం	✱	3 రా	యి	✱	4 కి	✱	5 దా	✱
తి	✱	త	✱	6 కా	మా	✱	7 కం	✱	8 ప	ర	9 దా
✱	10 అ	నం	11 త	✱	12 య	జ్ఞో	ప	వీ	తం	✱	స్వం
13 మా	ను	✱	14 ల	15 వ	ణం	✱	నం	✱	16 గు	చ్ఛం	✱
✱	17 మా	ఘ	మా	సం	✱	18 సా	✱	19 ప	లు	✱	20 గు
21 మౌ	నం	✱	22 ని	తం	23 బం	✱	24 రా	తి	✱	25 బ	✱
ని	✱	26 సా	కం	✱	27 గా	28 రా	బం	✱	29 వి	స్తా	30 రం
✱	31 మో	వి	✱	32 సౌ	రం	గం	✱	33 రా	మ	✱	భ్రం
34 పా	✱	35 త్రి	36 వృ	ర	✱	37 తా	త	పి	ల	38 క	✱
39 నీ	డ	✱	త్త	✱	40 ఘ	నం	✱	డి	✱	41 పో	టీ
యం	✱	42 ప	డి	43 శం	✱	44 ప	45 గ	✱	46 బ	లం	✱
✱	47 స	ద్మం	✱	48 ప	క్షి	✱	49 జం	బు	కం	✱	50 లు

సుడొకు

8	1	2	7	3	9	6	4	5
7	3	5	8	6	4	2	9	1
9	6	4	2	1	5	8	7	3
3	7	1	9	2	8	5	6	4
4	2	9	6	5	3	1	8	7
5	8	6	1	4	7	9	3	2
1	9	7	3	8	2	4	5	6
6	5	3	4	9	1	7	2	8
2	4	8	5	7	6	3	1	9

A B C D E F 1 2 3

(c) eenadu









ఊరంతా మిరప తోరణాలు!








మన దగ్గర ఇంటి గుమ్మాలకు మామిడి ఆకుల తోరణాలో, బంతి పూల దండలో కనిపిస్తాయా... కానీ చైనాలోని బైజీ ప్రాంతంలోని గ్రామాల్లో మాత్రం అందంగా అల్లిన మిరపకాయల తోరణాలు ఉంటాయి. అంతేనా... పొలాల్లో, ఊళ్లల్లో ఎక్కడ చూసినా ఆ ఎర్రెర్రటి పొడవైన మిరపకాయల దండలే దర్శనమిస్తాయి. ఎందుకంటే- దేశం మొత్తంలోనే మిరపపంటకు ప్రసిద్ధి చెందిన ఈ ప్రాంతంలోని మిరప- రంగూ, రుచీ, రూపంలోనూ నాణ్యంగా పండుతుంది. అందుకే కొన్ని వందల సంవత్సరాలుగా స్థానికులు వేల ఎకరాల్లో వీటిని సాగు చేస్తున్నారు. మిరపకాయలను పొడవాటి దండల్లా కట్టి ఇంటి లోపలా, బయటా ఎండబెడుతూ... కారం పొడి, సాస్ వంటి రకరకాల ఉత్పత్తుల్ని తయారుచేస్తున్నారు. ఇంకా విదేశాలకూ టన్నుల కొద్దీ ఎగుమతి చేస్తుంటారట. ఈ ప్రత్యేకత కారణంగానే- మిరపకి హోమ్‌టౌన్‌గా చెప్పే ఈ ప్రాంతం ఓ పర్యటక ఆకర్షణగా కూడా మారింది.

(c) eenadu

లోక కంటకుడైన మహిషాసురుడిని సంహరించిన జగన్మాత విశ్వరూపం- ఊహకే ఓ అద్భుతం! ఆ ఘట్టాన్ని అనుభూతి చెందాలనుకుంటే- ఉత్తర్‌ప్రదేశ్‌లోని బృందావనం వెళ్లాల్సిందే! అమ్మవారి శక్తిరూపాలన్నీ ఏకమై అవతరించిన మాతా వైష్ణోదేవి- 141 అడుగుల నిలువెత్తు విగ్రహం ఉంటుందిక్కడ. విగ్రహం కింద గుహను పోలిన దేవీ మందిరంలో నవ దుర్గల దర్శనమూ చేసుకోవచ్చు. ఇక్కడ అట్టహాసంగా జరిగే శరన్నవరాత్రుల్లో వేలాది భక్తులు పాల్గొంటారు!



(c) eenadu